కింద పడ్డానని ఆగిపోకు,
తిరిగి ప్రయత్నం చేస్తే
విజయం నీదే
- అబ్దుల్ కలాం

Truth of News
PRGI Reg No: APTEL/26/A4782
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

శ్రీసత్యసాయి | సంపుటి: 03 | సంచిక : 51 | బుధవారం 30 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50
Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'..

## ప్రధాని మోదీ రాజీనామా చేయాలి: కాంగ్రెస్

- ఎన్నికల ప్రక్రియలో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపణ
- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు డిమాండ్
- 13.30 కోట్ల ఓట్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని తీర్మానం
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని పట్టు
- పార్లమెంటు, కోర్టులు, వీధుల్లో పోరాడతామని కాంగ్రెస్ ప్రకటన



**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం**

ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు.

దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయ స్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



## ఉప్పొంగిన ఇంద్రావతి

- 53 ఏళ్ల రికార్డు బద్దలు
- రాజస్థాన్‌లో వడగళ్ల వాన, యూపీలో పెరిగిన చలి
- హిమాచల్‌లో విరిగిపడ్డ కొండచరియలు
- ఉత్తరకాశీలో చిక్కుకున్న పర్వతారోహకులను కాపాడిన రెస్క్యూ బృందాలు

**రాయ్‌పూర్ - సూర్య వాస్తవం**

ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలతో ఇంద్రావతి నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. 53 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టింది. మంగళవారం చిత్రావతి నది 12.39 మీటర్ల ఎత్తున ప్రవహిస్తూ 1973 నాటి 12.18 మీటర్ల రికార్డును వెనక్కు నెట్టింది. దీంతో అనేక లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. అధికారులు బోట్లు, హెలికాప్టర్ల ద్వారా 833 మందిని రక్షించారు. నీటిమట్టం పెరుగుతుండడంతో తీర ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి 65 సహాయక శిబిరాల్లో 8,894 మందికి ఆశ్రయం కల్పించారు. మరోవైపు రాజస్థాన్‌లోని జైపూర్, బికనీర్, చురులో వడగళ్ల వాన కురుస్తుంది. రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా

- మిగతా 2లో..



## సుప్రీం తలుపు తట్టిన పిటిషనర్

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ మెన్షన్ చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకపక్షంగా కాకుండా, కమిషన్‌లోని సభ్యుల ఏకాభిప్రాయం లేదా మెజార్టీ నిర్ణయం మేరకు ఉండాలని పిటిషనర్ కోరారు. ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్నికల కమిషన్‌లో ఏ ఒక్క సభ్యుడూ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండకూడదని పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. సీఈసీ వ్యవహారశైలిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈసీకి సంబంధించిన వివాదంపై దాఖలైన పిటిషన్‌పై వచ్చేవారం సుప్రీంకోర్టు విచారణ జరపనుంది.



## నిరసనలకు పోలీసుల నో పర్మిషన్

- జంతర్‌మంతర్ అక్టోబర్ 2న సీజేపీ, ఇండి కూటమి పిలుపు
- ముంబై శివాజీ పార్కు సమావేశానికి నిరాకరణ
- ఎస్ఐఆర్, ఈసీ పనితీరుపై 30న కాంగ్రెస్ కూటమి మీటింగ్

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం**

సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 2న జంతర్‌మంతర్ వద్ద సీజేపీ, కాంగ్రెస్ కూటమి పార్టీల నిరసనలకు ఢిల్లీ పోలీసుల అనుమతి లభించలేదు. ఈ విషయాన్ని ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు

- మిగతా 2లో..

# పల్లె పండుగ 3.0 ప్రారంభం..

- గ్రామాలకు రూ.11,085 కోట్లు: సీఎం చంద్రబాబు
- ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన
- గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో తమ రెండేళ్ల పాలనను పోల్చిన ముఖ్యమంత్రి
- వెలిగొండ ఫేజ్-2 పూర్తితో పాటు ఉదయగిరి ప్రాంతానికి పలు ప్రాజెక్టులు మంజూరు
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే ఎన్డీయే ప్రభుత్వ మంత్రమని స్పష్టీకరణ



**ఉదయగిరి - సూర్య వాస్తవం**

రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ-3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం.

- మిగతా 2లో..

## అమెరికాకు 100 ఏళ్లు పట్టింది, భారత్‌కు 20 ఏళ్లు చాలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- విజయవాడలో జరిగిన మిషన్ కర్మయోగి వర్క్‌షాప్
- ఉద్యోగుల సామర్థ్య పెంపులో ఏపీకి జాతీయ స్థాయిలో తొలి ర్యాంక్
- విజేతలకు అవార్డులు అందజేసి ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- సాంకేతికత, నైపుణ్యాలతోనే దేశాభివృద్ధి సాధ్యమన్న సీఎం
- రెండో స్థానంలో కర్ణాటక, మూడో స్థానంలో ఒడిశా



**విజయవాడ- సూర్య వాస్తవం**

అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి అమెరికాకు వందేళ్లు పడితే, ఆసియా దేశాలకు ఆరు నుంచి ఏడు దశాబ్దాలు పడితే, చైనాకు 45 ఏళ్లు పట్టిందని, కానీ నేటి భారత్‌కు ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి 20 ఏళ్లు చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. సరైన నాయకత్వం, సాంకేతికత, అపారమైన యువశక్తితో ఈ అద్భుతాన్ని సాధించగల సత్తా భారత్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో మంగళవారం జరిగిన 'మిషన్ కర్మయోగి' వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడంలో (కెపాసిటీ బిల్డింగ్) దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలిచినందుకు గాను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలపర్తి వెంకటేశ్వరరావులకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. ఇదే విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన కర్ణాటక, తృతీయ స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాల ప్రతినిధులకు కూడా ఆయన అవార్డులు అందజేశారు.

**భవిష్యత్తు మనదే.. మార్పు అనివార్యం**

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ,

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# స్టార్‌షిప్ సూపర్ సక్సెస్

- నింగిలోకి దూసుకెళ్లిన ఎలాన్ మస్క్ కలల రాకెట్
- తొలిసారిగా భూకక్ష్యలోకి



**న్యూయార్క్- సూర్య వాస్తవం**

స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన, భారీ రాకెట్ 'స్టార్‌షిప్'2026ను సోమవారం తొలిసారిగా భూకక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించి చరిత్ర సృష్టించింది. టెక్సాస్‌లోని

- మిగతా 2లో..

# ఉప్పొంగిన ఇంద్రావతి

(మొదటిపేజీ తరువాయి)

తగ్గిపోయాయి. అటు ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ, రాంపూర్, బదౌన్లలో దట్టమైన పొగమంచు కమ్ముకొని చలితీవ్రత పెరిగింది. హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో జాంగ్లిఖ్ వంతెన సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో హిమపాతంలో చిక్కుకుపోయిన పర్యాటకులను రెస్క్యూ బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. ఇదిలా ఉండగా మిగతా ప్రాంతాల నుంచి అర్నాబ్ తుపాను వల్ల ఏర్పడిన గాలులు, రుతుపవనాలు దేశం నుంచి ఉపసంహరించుకోవడం ప్రారంభించినట్లు ఐఎండీ అధికారులు తెలిపారు.

# నిరసనలకు పోలీసుల నో పర్మిషన్

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం మీడియాకు తెలిపారు. ఎస్ఐఆర్ ఆరోపణల నేపథ్యంలో జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో ఈ నిరసనలు చేపడతామని ఇప్పటికే సీజేపీ ప్రతినిధి అభిజీత్ దీప్కే ప్రకటించగా, కాంగ్రెస్ కూటమి పార్టీలు కూడా నిరసనల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మరోవైపు ఇదే అంశంపై ముంబై పోలీసులు కూడా శివాజీ పార్కులో నిర్వహించే సమావేశానికి అనుమతిని నిరాకరించారు.

ఈ అంశం, అధికారం తమ పరిధిలోది కాదన్నారు. ఈ ప్రాంతం నిశ్శబ్ద జోన్ కిందకు వస్తుందన్నారు. ప్రత్యామ్నాయ వేదికను చూసుకొని అనుమతి కోరాలని, పరిశీలిస్తామని ప్రకటించారు. కాగా ఎస్ఐఆర్ ప్రక్రియ, ఈసీ పనితీరుపై 30న భారత కూటమి సమావేశం జరగనున్నట్లు సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య వెల్లడించారు. ఈ చర్చలు కేవలం భాగస్వాములకు మాత్రమే పరిమితం కాకుండా అన్ని వర్గాలు, సంఘాలకు కూడా స్థానం కల్పించాలని కోరారు. పీడీపీ అధినేత్రి మొహబూబా ముఫ్తీ కూడా జంతర్ మంతర్ నిరసనల్లో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# స్టార్‌షిప్ సూపర్ సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

బోకా చికాలో ఉన్న స్పేస్ఎక్స్ 'స్టార్‌బేస్' లాంచ్ సైట్ నుంచి ఫ్లైట్ 14 ప్ర యోగంలో భాగంగా ఈ మైలురాయి నమోదైంది. నాసా, ఆర్టెమిస్ చంద్ర కార్యక్రమానికి తన సంసిద్ధతను నిరూపించుకోవడానికి, భూమి చుట్టూ ఆరు పూర్తి ప్రదక్షిణలు చేసే లక్ష్యంతో, స్పేస్ఎక్స్ దీన్ని ప్రయోగించింది. అతేకాదు సరికొత్త, అత్యంత అధునాతనమైన 26 స్టార్లింక్ ఉపగ్రహాలను ఇది మోసుకెళ్లింది. అంతకుముందు జరిగిన 13 ప్ర యోగాలు సబ్-ఆర్బిటల్ (భూకక్ష్యకు దిగువన) మార్గంలో సాగగా, ఈ 14వ పరీక్షలో స్టార్‌షిప్ ఎగువ భాగం (షిప్ 41) మొదటిసారిగా భూమి చుట్టూ ఉన్న స్థిరమైన కక్ష్యకు చేరుకుంది. అయితే రాకెట్ నింగిలోకి దూ సుకెళ్తున్న సమయంలో ఎగువ దశలోని ఆ రు ఇంజిన్లలో ఒకటి అకస్మాత్తుగా ఆగిపోయింది. ఒక దశలో కక్ష్య ప్రయత్నాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, ఫ్లైట్ కంట్రోలర్లు చాకచక్యంగా వ్యవహరించి మిషన్‌ను ముందుకు తీసుకెళ్లారు. చివరకు సింగిల్ రాప్టర్ ఇంజిన్‌ను మండించి రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపారు. కక్ష్యలోకి చేరిన తర్వాత స్టార్‌షిప్ తన మొద టి వాణిజ్య ఆదాయ మిషన్‌ను కూడా పూర్తి చేసింది. ఇందులో భాగంగా మునుపటి త రం కంటే 10 రెట్లు ఎక్కువ సామర్థ్యం కలిగి న 26 అత్యాధునిక మూడో తరం (వీ3) స్టార్‌లింక్ ఇంటర్నెట్ ఉపగ్రహాలను అంతరిక్షంలో కి ప్రవేశపెట్టింది. ఈ మిషన్ నిజానికి భూమి చుట్టూ 6 ప్రదక్షిణలు చేసి, దాదాపు 10 గంటల తర్వాత చిలీ తీరంలో పసిఫిక్ మహాసముద్రంలో పడాల్సిఉంది. అయితే, ఇంజిన్ సమస్య కారణంగా మిషన్‌ను ముందుగానే అంటే మూడుగంటల్లోనే ముగించి, తక్కువ కక్ష్యల తర్వాతే పసిఫిక్ మహాసముద్రంలో విజయవంతంగా స్ప్లాష్‌డౌన్ చేశారు.

# పల్లె పండుగ 3.0 ప్రారంభం..

(మొదటిపేజీ తరువాయి)



మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

**గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు**

'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ. 2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది," అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

**ఉదయగిరికి వరాల జల్లు**

ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు.
65,000 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ. 52.52 కోట్లు.
90,000 ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 భూసేకరణకు రూ. 85 కోట్లు.
రూ. 3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉద్యోగాలిచ్చే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉదయగిరిని తీర్చిదిద్దేందుకు అవసరమైన క్లియరెన్సులు.
కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల సమస్య పరిష్కారానికి రూ. 100 కోట్లు.
వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-2ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

**సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం**

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ. 4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రూ. 10 లక్షల కోట్ల అప్పులతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు.

రాష్ట్రానికి రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# అమెరికాకు 100 ఏళ్లు పట్టింది, భారత్‌కు 20 ఏళ్లు చాలు

(మొదటిపేజీ తరువాయి)

"భారత్ ఇప్పుడు ఒక నిర్ణయాత్మకమైన దశలో ఉంది. మనకు జ్ఞానం, సాంకేతికత, అపారమైన అవకాశాలు ఉన్నాయి. మన యువతలో అసాధారణమైన ఆకాంక్షలు ఉన్నాయి. ఈ ఆకాంక్షలను నెరవేర్చేందుకు మన పరిపాలనా వ్యవస్థలు సిద్ధంగా ఉన్నాయా? అన్నదే అసలైన ప్రశ్న. రాబోయే 20 ఏళ్లు దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకం" అని విశ్లేషించారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో మార్పులు చూశానని, ఒకప్పుడు కరెంట్, రోడ్లు, కనీసం ట్యాప్ వాటర్ కూడా లేని గ్రామం నుంచి తాను వచ్చానని గుర్తుచేసుకున్నారు. పదుల గ్రామాలకు కలిపి ఒకే ఒక్క టెలిఫోన్ ఉండేదని, అది కూడా పనిచేసేది కాదని నాటి పరిస్థితులను వివరించారు.

**సాంకేతికతతో సుపరిపాలన**

అలాంటి రోజుల నుంచి నేడు డిజిటల్ ఇండియా వరకు దేశం ఎంతో మారిందన్నారు. "గతంలో ఒక ఫైల్ ముందుకు కదలాలంటే ఎల్‌డీసీ నుంచి అదనపు కార్యదర్శి వరకు 15 నుంచి 20 స్థాయిలు దాటాల్సి వచ్చేది. కొన్నిసార్లు ఫైళ్లు కనపడక రోజుల తరబడి వెతకాల్సి వచ్చేది. కానీ ఈ-ఆఫీస్ విధానంతో ఇప్పుడు నిమిషాల్లో ఫైళ్లను క్లియర్ చేయగలుగుతున్నాం. నేను కూడా రోజుకు 15-20 నిమిషాల్లో ఫైళ్లను పూర్తి చేస్తున్నా" అని తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో అంగన్‌వాడీ టీచర్ కూడా తనకంటే మెరుగ్గా ఉన్నారని ప్రశంసించారు. రియల్ టైం గవర్నెన్స్, డేటా లేక్, కృత్రిమ మేధ (ఏఐ), డ్రోన్లు, సెన్సార్ల వాడకంతో పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ సేవలను చేరవేయడమే లక్ష్యమని వివరించారు.

**పిల్లి నల్లదా తెల్లదా అనేది ముఖ్యం కాదు.. ఎలుకను పట్టడమే ముఖ్యం!**

ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'మిషన్ కర్మయోగి' ఒక అద్భుతమైన సంస్కరణ అని చంద్రబాబు కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఇది ఎంతగానో దోహదపడుతోందన్నారు.

ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ఒక సెకండరీ గ్రేడ్ టీచర్ 4,200 కోర్సులు పూర్తి చేసి, జాతీయ స్థాయిలో 14,500 క్రెడిట్లు సాధించడం దీని విజయానికి నిదర్శనమన్నారు. చైనా ఆర్థిక సంస్కరణలను ప్రస్తావిస్తూ, "పిల్లి నల్లదా, తెల్లదా అన్నది ముఖ్యం కాదు, అది ఎలుకలను పడుతుందా లేదా అన్నదే ముఖ్యం" అనే డెంగ్ షియావోపింగ్ సూక్తిని గుర్తుచేశారు. ఫలితాలు రాబట్టడమే మన అంతిమ లక్ష్యం కావాలన్నారు.

**స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యం**

ఆంధ్రప్రదేశ్‌ను 'స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047'గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటును 15 శాతానికి పైగా సాధించే సత్తా ఏపీకి ఉందన్నారు. "ఆంధ్రప్రదేశ్‌ను మిగతా రాష్ట్రాలకు ఒక పరిశోధన, అభివృద్ధి కేంద్రంగా (=ఉఅ జవత్‌వతీ), ఒక ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌గా నిలబెడతాం. ఇక్కడ విజయవంతమైన నమూనాలను ఇతర రాష్ట్రాలు అనుసరించేలా చేస్తాం" అని ప్రకటించారు. సంక్షేమం, అభివృద్ధిని జోడించి సంపద సృష్టించి, ఆ ఫలాలను నిరుపేదలకు అందించడం ద్వారా అసమానతలను తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోని నదుల అనుసంధానం పూర్తయితే భారత్‌ను ఎవరూ ఆపలేరని ఆయన అన్నారు. అంతిమంగా మనమంతా భారతీయులమని, పార్టీలు, ప్రాంతాలు వేరైనా దేశాన్ని ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో నిలపాలన్నదే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు.

# సహారా రిఫండ్‌కు... ఎందుకింత జాప్యం...?

## - పుష్కర కాలం దాటిన డబ్బు కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలు




**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** సహారా పథకాల్లో డబ్బులు పెట్టిన సామాన్య పెట్టుబడిదారుల ఎదురుచూపులు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నెలలో వస్తుంది.. వచ్చే వారంలో వస్తుంది. అంటూ ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని పలువురు పెట్టుబడిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు పెట్టుబడిదారులకు అందుబాటులో ఉన్న బ్రాంచ్ మేనేజర్లు, ఏజెంట్లు, మధ్యవర్తులు ఇప్పుడు స్పందించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. మరోవైపు సామాజిక మాధ్యమాల్లో రిఫండ్‌కు సంబంధించి వస్తున్న అనధికారిక సమాచారం మరింత గందరగోళానికి దారితీస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో ఒకరికి పది వేల రూపాయలు వచ్చాయి మధ్యప్రదేశ్‌లో మరొకరికి ఐదు వేల రూపాయలు వచ్చాయి అంటూ ప్రచారం చేసే సందేశాలు సామాజిక మాధ్యమాల్లో విస్తరిస్తున్నాయి. కొన్ని వర్గాలు వీటిపై ఆధారపడి ఆన్‌లైన్ సమావేశాలు, వివరణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాయి. అయితే ఇలాంటి సమాచారానికి అధికారిక ధ్రువీకరణ లేకపోవడంతో పెట్టుబడిదారుల్లో మరింత అయోమయం నెలకొంటోంది. సహారా రిఫండ్ వ్యవహారం భారతదేశంలోనే అత్యంత దీర్ఘకాలిక ఆర్థిక, న్యాయ వివాదాల్లో ఒకటిగా కొనసాగుతోంది. ముఖ్యంగా సహారా సహకార సంఘాల్లో పెట్టుబడి చేసిన కోట్లాది మంది తమ డబ్బు పూర్తిగా ఎప్పుడు తిరిగి వస్తుందో స్పష్టత కోసం ఎదురుచూస్తున్నారు.

**వివాదానికి మూలం ఏమిటి?**

సహారా గ్రూప్‌కు చెందిన రెండు సంస్థలు ప్రత్యేక ఆర్థిక సాధనాల ద్వారా భారీ మొత్తాలను సమీకరించాయి. ఈ నిధుల సమీకరణపై భారతీయ సెక్యూరిటీస్ నియంత్రణ సంస్థ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వివాదం ప్రారంభమైంది.

సహారా మాత్రం తాము జారీ చేసిన ఆర్థిక సాధనాలు సంబంధిత చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని, అవసరమైన పత్రాలు సమర్పించి కంపెనీల రిజిస్ట్రార్ పరిధిలో అనుమతులు పొందామని వాదించింది. నియంత్రణ సంస్థ ఈ వాదనను అంగీకరించలేదు. వివాదం న్యాయ స్థానాలను ఆశ్రయించడంతో చివరకు సుప్రీంకోర్టుకు చేరింది. రెండు సహారా సంస్థలు పెట్టుబడిదారుల నుంచి సమీకరించిన మొత్తాలను వడ్డీతో సహా తిరిగి చెల్లించేలా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో కొనసాగాల్సి వచ్చింది. అయితే రిఫండ్ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కూడా పెట్టుబడిదారుల గుర్తింపు, చెల్లింపుల రికార్డులు, పత్రాల సమగ్రత వంటి అంశాలు వివాదానికి కారణమయ్యాయి.

**రికార్డులే ప్రధాన సమస్యగా మారాయా?**

సహారా తరఫున గతంలో సమర్పించిన వాదనల ప్రకారం, పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులకు ఇప్పటికే చెల్లింపులు చేసినట్లు పేర్కొంది. నియంత్రణ సంస్థ వద్ద ఉన్న రికార్డులు పూర్తి స్థాయిలో లేవని కూడా సహారా వాదించింది.

మరోవైపు, రిఫండ్ ప్రక్రియలో పెట్టుబడిదారుల వివరాలను ధ్రువీకరించాల్సిన అవసరం ఉండటంతో పత్రాల పరిశీలనకు గణనీయమైన సమయం పట్టింది. 2013లో సహారా నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులు, రిడంప్షన్ వోచర్లు ఉన్న పత్రాలను తరలించిన విషయం కూడా ఈ వివాదంలో ప్రస్తావనకు వచ్చింది. అయితే పత్రాలు అసంపూర్ణంగా ఉండటం, వివరాలను సరిపోల్చడం కష్టంగా మారడం వంటి అంశాలు రిఫండ్ ప్రక్రియను సంక్లిష్టం చేశాయి. దీంతో అసలు పెట్టుబడిదారుల వివరాలను ఖచ్చితంగా నిర్ధారించడం, ఇప్పటికే చెల్లించిన మొత్తాలను వేరు చేయడం, మిగిలిన మొత్తాలను గుర్తించడం వంటి ప్రక్రియలు సుదీర్ఘంగా మారాయి.

**ఐదు వేల కోట్ల రిఫండ్‌కు మార్గం**

ఈ దీర్ఘకాలిక వివాదంలో 2023లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సహారా సహకార సంఘాల పెట్టుబడిదారులకు రిఫండ్ చేయడానికి నియంత్రణ సంస్థ వద్ద ఉన్న నిధుల నుంచి ఐదు వేల కోట్ల రూపాయలను కేంద్ర సహకార సంఘాల రిజిస్ట్రార్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో సహారా సహకార సంఘాల పెట్టుబడిదారుల కోసం ప్రత్యేక రిఫండ్ వ్యవస్థ, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం ఏర్పాటైంది. చిన్న పెట్టుబడిదారులకు ప్రాధాన్యత ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రక్రియ ద్వారా అనేక మంది పెట్టుబడిదారులకు చెల్లింపులు జరిగినప్పటికీ, పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు ఇంకా తమ వంతు కోసం ఎదురు చూస్తున్నారు.

**ఎందుకు ఇంత జాప్యం?**

రిఫండ్ ఆలస్యానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. పెట్టుబడిదారుల గుర్తింపు ధ్రువీకరణ, దరఖాస్తుల్లో లోపాలు, బ్యాంకు వివరాల సమస్యలు, పాత రికార్డులతో సరిపోల్చడం, ఇప్పటికే చెల్లింపులు జరిగాయా లేదా అన్నది నిర్ధారించడం వంటి అంశాలు ప్రక్రియను నెమ్మదింపజేస్తున్నాయి. అదనంగా, సహారా గ్రూప్‌కు చెందిన వివిధ సంస్థలు, సహకార సంఘాలు, నియంత్రణ సంస్థలు, కేంద్ర సహకార వ్యవస్థ, న్యాయస్థానాలు వంటి అనేక సంస్థలు ఈ ప్రక్రియలో భాగస్వాములుగా ఉండటం కూడా వ్యవహారాన్ని సంక్లిష్టం చేసింది. అధికారిక ప్రక్రియలో ప్రతి దరఖాస్తును ధ్రువీకరించాల్సిన అవసరం ఉండటంతో, ఒకేసారి కోట్లాది దరఖాస్తులను పరిష్కరించడం సులభం కాదు. సామాన్య పెట్టుబడిదారుడి ప్రశ్న ఒక్కటే కోర్టులు ఆదేశాలు ఇచ్చాయి. ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. రిఫండ్ కోసం నిధులు కేటాయించబడ్డాయి. ఆన్‌లైన్ విధానం కూడా అందుబాటులోకి వచ్చింది.

సామాన్య పెట్టుబడిదారుడి ప్రశ్న మాత్రం మారలేదు: నా డబ్బు ఎప్పుడు వస్తుంది?

సంవత్సరాలుగా చిన్న మొత్తాలను పొదుపు చేసిన కుటుంబాలకు ఆ డబ్బు కేవలం ఒక పెట్టుబడి కాదు. పిల్లల విద్య, వైద్యం, కుటుంబ అవసరాలు, వృద్ధాప్య భద్రత వంటి వాటికి అది ఆధారం.

రిఫండ్ ప్రక్రియలో పారదర్శకత, వేగం, స్పష్టమైన సమాచారం అత్యంత అవసరం.

సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అనధికారిక సందేశాలపై ఆధారపడకుండా, పెట్టుబడిదారులకు ప్రభుత్వం మరియు సంబంధిత సంస్థలు ఎంత మొత్తం అందుబాటులో ఉంది, ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని పరిష్కరించబడ్డాయి, ఎన్ని తిరస్కరించబడ్డాయి, తిరస్కరణకు కారణాలేమిటి, ఇంకా ఎంత మొత్తం చెల్లించాల్సి ఉంది అనే వివరాలను క్రమం తప్పకుండా బహిరంగపరచాల్సిన అవసరం ఉంది.

**జాప్యానికి ముగింపు ఎప్పుడు?**

సహారా రిఫండ్ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక కంపెనీ, ఒక నియంత్రణ సంస్థ లేదా ఒక కోర్టు కేసు సమస్యగా చూడలేం. ఇది లక్షలాది మంది సామాన్య పెట్టుబడిదారుల పొదుపులకు సంబంధించిన అంశం. న్యాయ ప్రక్రియకు సమయం అవసరం కావచ్చు. ధ్రువీకరణ ప్రక్రియకు కూడా పరిమితులు ఉండవచ్చు. కానీ సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న చిన్న పెట్టుబడిదారులకు స్పష్టమైన గడువు, పారదర్శక సమాచారం, సులభమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ అందించడం ప్రభుత్వ సంస్థల బాధ్యత.

చివరకు మిగిలేది ఒక్క ప్రశ్నే--- సహారా పెట్టుబడిదారుల రిఫండ్ ప్రక్రియ పూర్తిగా ఎప్పుడు ముగుస్తుంది?

పుష్కర కాలం దాటిన ఈ వివాదంలో, సామాన్యుడి నిరీక్షణకు ఇక గడువు ఎప్పుడు ముగుస్తుందో స్పష్టత రావాల్సి ఉందని డా. ముచ్చుకోట సురేష్ బాబు నిర్వాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, పౌర స్పందన వేదిక జాతీయ నాయకులు ప్రొ గంగంపల్లి వెంకటశివారెడ్డి, డా ఉద్దండం చంద్రశేఖర్, టెక్నీషియన్ సంఘం అధ్యక్షుడు బాయినేని నాగేంద్ర ప్రసాద్ తదితరులు కోరారు.

## సంపాదకీయం

# తెరపైకి సూట్ కేసు పార్టీలు

ఇప్పటి వరకు సూట్ కేసు కంపెనీలనే చూశాము... ఇప్పుడు సూట్ కేసు పార్టీలు కూడా వచ్చేవాయి..కాగితాలకే పరిమితమైన కొన్ని పార్టీలకు విరాళాల రూపంలో వందల కోట్ల నిధులు అందుతున్న విషయం మూడు వారాల కిందట వెలుగులోకి వచ్చింది. గుజరాత్‌లోని గాంధీ నగర్‌లో సీఐడీ క్రైమ్ పోలీసులు తాజాగా ఇటువంటి పార్టీలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. గుజరాత్‌లోని ఆరు చిన్న పార్టీలు 2023-24లో 1700 కోట్ల రూపాయల విరాళాలు అందుకున్నట్టు పరిశోధనలో తేలింది. ఈ మొత్తం బీజేపీ మినహా అన్ని జాతీయ పార్టీల మొత్తం ఆదాయానికి కంటే ఎక్కువ.భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్)లోని 173 సెక్షన్ ప్రకారం ఈ రాజకీయ పార్టీలపై కేసులు నమోదు చేశారు.ఆదాయపు పన్ను శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు ఆరు పార్టీల్లో కనీసం మూడింటిపై పోలీసు కేసులు నమోదు అయ్యాయి.భారతీయ నేషనల్ జనతా దళ్, గరీబ్ కల్యాణ్ పార్టీ, స్వతంత్ర అభివ్యక్తి పార్టీలపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. స్థానిక గుజరాతీ వార్తా పత్రికల ప్రకారం సత్యవాది రక్షక్ పార్టీ అనే నాల్గో పార్టీపై కూడా ఎఫ్ఐఆర్ రిజిస్టర్ అయ్యింది. అయితే దీనికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ వద్ద లేకపోవడంతో నిర్ధరించలేకపోతోంది.'ఈ కేసులో రెండు పార్టీలు అహ్మదాబాద్‌కు చెందినవికాగా, మరొకటి గాంధీనగర్‌కు చెందింది' అని గాంధీనగర్ సీఐడీ క్రైమ్ విభాగం అధికారి ఒకరు చెప్పారు.ఈ కేసులో అరెస్టులు ఏమైనా జరిగాయా అని అడగగా, ' ఇప్పటి వరకు ఒక్కర్ని కూడా అరెస్టు చేయలేదు, దర్యాప్తు కొనసాగుతోంది' అని చెప్పారు. గాంధీనగర్ కేంద్రంగా నడుస్తున్న భారతీయ నేషనల్ జనతా దళ్, దానితో సంబంధం ఉన్న నలుగురిపై సీఐడీ క్రైమ్ విభాగం కేసు నమోదు చేసింది.ఈ పార్టీ 2019-20 నుంచి 2024-26 వరకు 1,143 కోట్ల నిధులు అక్రమ పద్ధతిలో స్వీకరించిందని, దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు 343 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లినట్టు అభియోగాలు మోపారు."నిందితులంతా కుమ్మక్కై నకిలీ పత్రాలు సృష్టించి వాటినే అసలైన పత్రాలుగా పేర్కొంటూ తప్పుడు విరాళాల నివేదికలను(ఫారం 24ఏ) ఎన్నికల సంఘానికి సమర్పించారని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు 343 కోట్లరూపాయల నష్టం వాటిల్లిందని" ఎఫ్ఐఆర్‌లో పోలీసులు వెల్లడించారు."ఈ కేసులో నిందితులు కుట్రపూరితంగా బోగస్ విరాళాలు చూపించి మోసానికి పాల్పడ్డారని ప్రాథమిక విచారణలో తేలింది. పన్నులు ఎగవేసే లక్ష్యంతో కమిషన్ ఏజెంట్ల ద్వారా నిధులు సేకరించి ఆర్టీజీఎస్ బ్యాంకింగ్ ఛానల్ ద్వారా ఐదు బ్యాంకు ఖాతాలకు నిధులను బదిలీ చేశారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది""విరాళ దాతలకు నకిలీ డొనేషన్ స్లిప్స్, డబ్బులు డిపాజిట్ చేసినట్టు నకిలీ రసీదులు నిందితులు అందజేసేవారు. దీంతో ఆ దాతలకు ఆదాయపు పన్ను చట్టంలోని 80జీజీబీ, 80జీజీసీ కింద తప్పుడు మార్గంలో వంద శాతం పన్ను మినహాయింపును పొందే అవకాశం లభించేది" అని పోలీసులు తెలిపారు.బీఎన్‌జేడీ జాతీయ అధ్యక్షుడు గజేరాతో పరిశోధనలో భాగంగా మాట్లాడినప్పుడు తాము ఏ తప్పు చేయడం లేదని చెప్పారు.'పార్టీ ఖాతా నుంచి డబ్బులు తీసుకోవడానికి లేదు. డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, ఎటు వెళ్తున్నాయో ఆదాయపు పన్ను శాఖకు తెలుస్తుంది' అని పేర్కొన్నారు. స్వతంత్ర అభివ్యక్తి పార్టీ 2023-2025 మధ్య 519 కోట్ల రూపాయల మోసానికి పాల్పడినట్టు పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ పత్రాలు సృష్టించి, అవే అసలైనవిగా భారత ఎన్నికల సంఘానికి నివేదికలను సమర్పించారు. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు 150 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఆ పార్టీకి వచ్చిన మొత్తం నిధుల్లో ఇది 30 శాతానికి సమానం. దీంతో ఆ పార్టీపై, ఆపార్టీతో కలిసి పని చేస్తున్న వారిపై ఆర్థిక మోసం, విశ్వాస ఘాతుకానికి పాల్పడిన ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అహ్మదాబాద్‌లోని నరోదా ప్రాంతంలో మహవీర్ నగర్ కల్యాణ్ మిల్‌కు ఎదురుగా ఉన్న షాప్ నెంబర్ 2లో స్వతంత్ర అభివ్యక్తి పార్టీ కార్యాలయం ఉంది.స్వతంత్ర అభివ్యక్తి పార్టీకి చెందిన పన్ను సలహాదారుడు మెహుల్ కుమార్ మహేష్ కుమార్ ఖాత్రీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు సురేంద్ర పర్షోత్తం తివారీ, చార్టర్డ్ అకౌంటెంట్ మయూర్ సింగ్ రాథోడ్‌తోపాటు ఇతర కార్యనిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.విరాళాలు తిరిగి ఇచ్చినట్టు చెప్పుకుంటున్న మెహుల్‌కుమార్ మహేష్‌కుమార్ ఖాత్రి మొబైల్ ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లో విరాళాలు ఇచ్చిన రాజకీయ నాయకుల పేర్లు లభించినట్టు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు. ఈ జాబితాలో స్వతంత్ర అభివ్యక్తి పార్టీకి లభించిన నకిలీ విరాళాల వివరాలు ఉన్నాయి.ప్రాథమిక దర్యాప్తులో నిందితుల నుంచి తీసుకున్న వాంగ్మూలాల ద్వారా అతిపెద్ద, వ్యవస్థాగత రాజకీయ విరాళాల కుంభకోణం బయటపడింది" అని ఎఫ్ఐఆర్‌లో తెలిపారు.ఈ స్వతంత్ర అభివ్యక్తి పార్టీ దేశంలోని వివిధ పన్ను చెల్లింపులదారుల నుంచి చెక్కు లేదా బ్యాంకింగ్ బదిలీ ద్వారా రాజకీయ విరాళాలను స్వీకరించింది. ఈ విరాళాల ఆధారంగా సెక్షన్ 80 జీజీబీ ప్రకారం చాలా మంది పన్ను చెల్లింపుదారులు తప్పుడు మార్గంలో పన్ను మినహాయింపు పొందారు. 8 నుంచి 9 శాతం కమీషన్‌గా తీసుకున్న తర్వాత మిగతా సొమ్మును క్యాష్ రూపంలో విరాళం ఇచ్చిన వారికి అందజేస్తారు." అని పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో ఎలాంటి రాజకీయ కార్యక్రమాలు లేవని, కేవలం కమీషన్ల కోసం, తప్పుడు లెక్కల కోసమే పార్టీ ఏర్పాటు చేసినట్టు స్వతంత్ర అభివ్యక్తి పార్టీ అధ్యక్షుడు సురేంద్ర తివారీ వాంగ్మూలం ఇచ్చినట్టు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు.సురేంద్ర తివారీ నేతృత్వంలోని పార్టీ 2023-24లో 219 కోట్ల రూపాయలను విరాళాల రూపంలో స్వీకరించారు. పార్టీకి వచ్చిన విరాళాల గురించి తనకు తెలియదని, సీఏ, మయూర్ సింగ్ తనను తప్పుదారి పట్టించారని సురేంద్ర తివారీ చెప్పారు.ఈ ఆరోపణలను మయూర్ సింగ్ ఖండించారు. తాను ఏ పార్టీనీ నడపడం లేదని, వివిధ పార్టీలకు ఎన్నికల సంఘం వద్ద ట్యాక్స్ ఫైలింగ్ మాత్రమే చేస్తున్నట్టు చెప్పారు. అందులో న్యూ ఇండియన్ యూనైటెడ్ పార్టీ కూడా ఉందని పేర్కొన్నారు.'అంతా ఒకేరకమైన మనుషులే, మీకు అర్థమవుతోంది కదా, ఇక్కడ పార్టీలు ఇళ్లలోనే నడుస్తాయి'అని ఆయన అన్నారు.స్వతంత్ర అభివ్యక్తి పార్టీసహా సురేంద్ర తివారీ, మయూర్ సింగ్, మెహుల్ కుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది.గరీబ్ కల్యాణ్ పార్టీ, అందులో పని చేస్తున్న 8 మందిపై సీఐడీ క్రైమ్ విభాగం కేసు పెట్టింది. ఈ పార్టీ అహ్మదాబాద్‌లోని నానా చిలోదా ప్రాంతం ఉన్న శ్రీనాథ్ షాపింగ్ సెంటర్ ఏ-203లో నడుస్తోంది.ఈ పార్టీ 2022- 2026 మధ్య 206 కోట్ల రూపాయల కంటే ఎక్కువ నిధులు స్వీకరించి అక్రమాలకు పాల్పడినట్టు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.దీని వల్ల కూడా ప్రభుత్వ ఖజానాకు 62 కోట్ల రూపాయల కంటే ఎక్కువ నష్టం వాటిల్లింది. ఇది ఆ పార్టీ స్వీకరించిన మొత్తం నిధుల్లో 30 శాతం. దీంతో ఆ పార్టీ, ఆ పార్టీలో పని చేస్తున్న వారిపై ఆర్థిక మోసానికి పాల్పడారనే కేసు నమోదు అయ్యింది.గరీబ్ కల్యాణ్ పార్టీ అక్రమ విరాళాలు స్వీకరించించినట్టు సేకరించిన గణాంక సమాచారం ఆధారంగా ఆదాయపు పన్ను శాఖ ఆ పార్టీ కార్యాలయంలో తనిఖీలు చేసింది. దీని ఆధారంగా లభించిన ఆధారాల మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు."ప్రాథమిక దర్యాప్తు, నిందితులు వాంగ్మూలాల ఆధారంగా ఇది భారీ, వ్యవస్థీకృతమైన నకిలీ విరాళాల కుంభకోణమని చెప్పవచ్చు. ఈ కుంభకోణంలో భాగంగా దేశంలోనే అధిక పన్ను చెల్లింపులదారుల నుంచి చెక్స్, బ్యాంక్ ఛానల్స్ ద్వారా రాజకీయ విరాళాలు స్వీకరించారు.ఈ విరాళాల ఆధారంగా పన్ను చెల్లింపుదారులు సెక్షన్ 80జీజీబీ ప్రకారం అక్రమమార్గంలో పన్ను మినహాయింపులు పొందారు.ఆ తర్వాత, ఆ నిధులు దశలవారీగా రెండు నకిలీ కంపెనీలకు (మెస్సర్స్ కృష్ణ ఎంటర్‌ప్రైజెస్, మెస్సర్స్ జలరామ్ ఎంటర్‌ప్రైజెస్) బదిలీ అయ్యాయి. చివరిగా ఆ నిధుల నుంచి 5 నుంచి 7 కమిషన్ మినహాయించుకున్నారు. మిగతా సొమ్మును దాతలకు క్యాష్ రూపంలో ఇచ్చేశారు" అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.క్షేత్ర స్థాయిలో ఎలాంటి కార్యకలాపాలు లేకపోయినా కేవలం నకిలీ ఎంట్రీలు, కమిషన్ల కోసమే పార్టీ ఏర్పాటు చేసినట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నీరజ్ క్షత్రియ, కోశాధికారి ధీరజ్ క్షత్రియ అంగీకరించారని ఎఫ్ఐఆర్‌లో తెలిపారు."దేశవ్యాప్తంగా వివిధ పన్ను చెల్లింపుదారుల నుంచి చెక్స్ లేదా ఆర్టీజీఎస్ ద్వారా విరాళాలు వచ్చాయి. దీని కోసం వారికి నకిలీ రసీదులు ఇచ్చారు. వీటి ఆధారంగా పన్ను చెల్లింపుదారులు తప్పుడు మార్గంలో 100 శాతం మినహాయింపును క్లెయిమ్ చేసుకోగలిగారు. ఇది పన్ను ఎగువేతకు వీలు కలిగింది.గరీబ్ కల్యాణ్ పార్టీ చెల్లుబాటు అయ్యే వోచర్లు, బిల్లులు, ఖాతాలు నిర్వహించడం లేదని విచారణలో తేలింది" అని ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు.ఈ పార్టీ 2023-24 మధ్య 138 కోట్ల విలువైన విరాళాలు స్వీకరించింది. ఇప్పుడు నీరజ్ కుమార్, ఆయన సోదరుడు ధీరజ్ కుమార్ సహా ఆరుగురిపై కేసు నమోదు అయ్యింది.



# నిత్యపెళ్లికొడుకు... కిట్టిగాడు,,!

- ప్రేమ పేరుతో వలపు వలలు - అమాయక ఆడపిల్లలే టార్గెట్
- ఆల్రెడీ ఒకరితో పెళ్లి.... మరొకరితో ప్రేమ
- ఐటీ ఉద్యోగి కాదు.... కేటు గాడు

**అనంతపురం - సూర్య వాస్తవం ప్రత్యేక కథనం :** ఒకమ్మాయిని ఏడున్నరేళ్లు ప్రేమించాడు. తర్వాత పెళ్లి చేసుకున్నాడు. వారికిప్పుడు పెళ్లయి మూడేళ్లయ్యింది. అంటే వారి ప్రేమ ఫలించి నేటికి పదేళ్లయింది. మళ్లీ వీర ప్రేమికుడికి మరొక అమ్మాయిపై వ్యామోహం కలిగింది. ఇంతవరకు జరిగిన పదేళ్ల ప్రేమ... ప్రేమే కాదని గ్రహించాడు.

కొత్తమ్మాయిని ట్రాప్ చేశాడు. ఇదే నిజమైన ప్రేమ అని ఆమెకు చెప్పాడు. పదేళ్లది డమ్మీ ప్రేమ అన్నాడు. అలా కొత్త అమ్మాయి వెనుక పడుతున్నాడు. ఇంతటి ఘనాతిఘనమైన ప్రేమికుడు నివాసం ఎక్కడంటే, సత్యసాయి జిల్లాలోని మడకశిర పరిధిలో జరిగిన ఘటన వివరాల్లోకి వెళితే...ఈ ఘనుడు ఎంబీఏ చదివాడు. బెంగళూరులోని ఒక ప్రైవేటు సాఫ్ట్ వేర్ కంపెనీలో నాన్ ఐటీ జాబ్ చేస్తున్నాడు. అదే కంపెనీలో ట్రైనీగా చేరిన అమ్మాయిని ట్రాప్ చేసి, మాయమాటలు చెప్పాడు. తన మొదటి భార్యకు విడాకులిచ్చి, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు.

ఇప్పుడీ ఘనుడు ఏం చేస్తున్నాడంటే అటు పెళ్లయిన భార్యను టార్గెట్ చేసి విడాకులిమ్మని వేధిస్తున్నాడు. మరోవైపు కొత్తమ్మాయికి ఆరు నెలల్లో అంతా సెట్ చేసి పెళ్లి చేసుకుంటానని హామీలిస్తున్నాడు.

చట్టం దగ్గరికెళితే, ఇద్దరు మహిళల్లో ఎవరో ఒకరు వచ్చి చెబితేనే గానీ ఏమీ చెయ్యలేమని నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. న్యాయస్థానానికి వెళితే, కేసు ఎన్నాళ్లు పడుతుందో తెలీదు. విషయం పదిమందికి తెలిస్తే కుటుంబ పరువు పోతుందని పెళ్లికాని అమ్మాయి తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. పదేళ్లు ప్రేమించి పెళ్లి చేసుకున్నమ్మాయి...ఎదిరిస్తే ఏమవుతుందోనని గుండెలవిసేలా ఏడుస్తోంది.

వ్యవస్థలన్నీ సోద్యం చూస్తున్నాయి. మరి దీనికి మార్గమే లేదా?

ఆడపిల్లలను ఉద్యోగాలకు పంపించడమే తల్లిదండ్రులు చేసిన నేరమా? అనే ప్రశ్న ఇక్కడ ఉదయిస్తోంది. ట్విస్ట్ ఏమిటంటే, ఈ ట్రయాంగిల్ లవ్ స్టోరీలో ఎవరో ఒకరికి అన్యాయం జరిగితేనేగానీ చట్టం కల్పించుకోకపోవడమే బాధాకరంగా ఉంది. అలా పెళ్లయిన అమ్మాయికి అన్యాయం జరగాల్సిందేనా? ఇక బంగారు భవిష్యత్తున్న పెళ్లికావల్సిన అమ్మాయి జీవితం నాశనం కావల్సిందేనా? మారుతున్న కాలం పేరు చెప్పి, ఇలా విలువలు వదిలేసి పరుగులెడుతున్న యువతను ఏం చెయ్యాలి? ఇప్పుడీ ఐటీ కంపెనీలు ఉద్యోగాలిస్తున్నాయా? బాగోతాలు ఆడిస్తున్నాయో తెలీడం లేదు. ఇటీవల తాజాగా టీసీఎస్ కంపెనీలో మహిళలను మోసం చేసిన ఘటనలో కొన్ని చట్టాలను కఠినం చేశారు అవేమిటంటే...ఒకటి.. పోష్ ఏక్ట్ 2013. దీనిని టీసీఎస్ సంఘటన తర్వాత మరింత కఠినతరం చేశారు. ఇది ఐటీ కంపెనీలతో సహా ప్రైవేట్ సంస్థలకు కూడా వర్తిస్తుంది. మహిళలపై వర్క్ ప్లేస్ లో హెరాస్ మెంట్ జరిగితే సంస్థలో ఇంటర్నల్ కమిటీ ఉండాలి. ఫిర్యాదులు స్వీకరించి విచారణ చేయాలి. ఒకవేళ వాళ్లు చెప్పకపోయినా హెచ్ ఆర్ డిపార్ట్ మెంట్ విచారించి నిర్ణయం తీసుకోవాలి. నష్టం జరిగాక విచారణ చేయడం కన్నా ముందుగానే ఉద్యోగులకు అవగాహన కల్పించాలి.

**భారతీయ న్యాయ సంహిత అని మరో చట్టం ఉంది.**

2024 నుంచి ఐపీసీ స్థానంలో బీఎన్ఎస్ అమల్లోకి వచ్చింది. మహిళలపై లైంగిక వేధింపులు, వెంటాడం, వేధించడం, మహిళ గౌరవాన్ని అవమానించడం వంటి నేరాలకు క్రిమినల్ చట్టం కింద కేసులు పెట్టవచ్చు. టీసీఎస్ నాసిక్ కేసులో కూడా బీఎన్ఎస్‌లోని సంబంధిత సెక్షన్లను ఉపయోగించారు.

**సైబర్ క్రైం, ఐటీ యాక్ట్ మరొకటి ఉంది.**

ఒక వ్యక్తి సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్ పెట్టడం. ఇంపర్సనేషన్, ప్రైవేటు ఫొటోగ్రాఫ్స్, సెక్సువల్లీ ఎక్స్‌ప్లిక్ట్ మెటీరియల్వంటి వాటిని ఉపయోగించి మహిళను మోసం చేస్తే లేదా వేధిస్తే ఐటీ యాక్ట్ లోని 66డి , 66ఈ , 67, 67ఏ వంటి నిబంధనలు, పరిస్థితిని బట్టి ఇతర క్రిమినల్ చట్టాలు వర్తించవచ్చు. సైబర్ క్రైం పోర్టల్, 1930 హెల్ప్ లైను కూడా ఉన్నాయి. మే 2026లోఎన్ సీ డబ్ల్యూ, టీసీఎస్ సంస్థలను ఉద్దేశించి 127 యూనిట్లలో, 10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న ప్రతి యూనిట్‌కు ప్రత్యేక ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.ఇవి కాకుండా ఒక ఐటీ ఉద్యోగి బయట ఒక మహిళను ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేస్తే, కేసు పరిస్థితిని బట్టి ఛీటింగ్, క్రిమినల్ ఇంటిమిడేషన్, స్టాకింగ్, సైబర్ క్రైమ్ మొదలైన క్రిమినల్ నిబంధనల కిందకు వెళ్లే అవకాశాలున్నాయి.ఇలా ఒకమ్మాయిని పెళ్లి చేసుకుని, అన్యాయం చేసి, మరొక అమ్మాయికి న్యాయం చేస్తానని చెబుతున్న ప్రబుద్ధుడికి ఎవరు బుద్ధి చెబుతారు. ఇద్దరు అమ్మాయిల బలహీనతలను అడ్డం పెట్టుకుని నాటకాలు ఆడుతూ, ఎవరికి చెప్పేవి వాళ్లకు చెబుతూ మోసం చేస్తున్న మాయలోడికి శిక్షే లేదా? ఇలాంటి మోసగాళ్ల వలలో అమ్మాయిలు పడకూడదని, మోసపోకూడదని మహిళా సంఘాలు మొత్తు కుంటున్నాయి. ఇంతకీ నిత్యపెళ్లికొడుకు కిట్టిగాడు ఏమంటున్నాడంటే, నాదేం తప్పు లేదు, నేను శ్రీరామచంద్రుడిని, ధర్మాత్ముడిని, మహాత్ముడిని ఒకమ్మాయి ప్రేమిస్తే వెంటనే ప్రేమించి, ఆమెకు అండగా ఉంటానని స్త్రీ జనోద్ధారకుడిలా చెబుతున్నాడు. ఆడపిల్లలు ఇలాంటి వారితో తస్మాత్ జాగ్రత్త. తల్లిదండ్రులు మరింత జాగ్రత్త. ఇలాంటి వారి వల నుంచి మీ పిల్లలను మీరే కాపాడుకోండి. వ్యవస్థలన్నీ నష్టం జరిగిన తర్వాతే వస్తాయి. అంతవరకు ఇలాంటి దగాకోరుల ఆటలు సాగుతూనే ఉంటాయి. అందుకనే ఎవరి జాగ్రత్తల్లో వారుండండి.

# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం

ఓటర్ల జాబితాపై వచ్చిన ఆరోపణలకు కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.దేశంలో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో జరుగుతున్నఓటర్లజాబితా సవరణ ప్రక్రియపై ప్రజల్లో, వివిధ రాజకీయ పార్టీల్లో తీవ్ర ఆందోళన వ్యక్త మవుతోందన్న విషయం అందరికి తెలిసిందే. ముఖ్యంగా పెద్ద సంఖ్యలోఓటర్లపేర్లుతొలగించబడుతున్నాయనే ఆరోపణలు,ఎన్నికల సంఘం అంతర్గతంగా కొన్ని నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వచ్చినవార్తలు,అలాగే వివిధ రాష్ట్రాల్లో రాజకీయ పార్టీల నిరసనలు ప్రజాస్వా మ్య వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలనులేవనెత్తుతున్నాయి.ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. ఓటర్ల పేర్లు తొలగించడం జరిగిందనే ప్రతి ఆరోపణను నేరం రుజువైందని ముందుగానే చెప్పడం సరైంది కాదు. అయితే,అర్హత ఉన్న పౌరు డి పేరు తప్పుగా తొలగించ బడితే, అది కేవలం ఒక పరిపాలనా తప్పిదం కాదు. ఆ పౌరుడి ప్రజాస్వామ్య భాగస్వామ్యం పై తీవ్రమైన ప్రభావం చూపే అంశం ఉందనే చెప్పాలి.20 సంవత్సరాలుగా ఓటు వేస్తున్న వ్యక్తి పేరు ఒక్కసారిగా ఎందుకు తొలగించాలి?

ఒక పౌరుడు గత 10, 15 లేదా 20 సంవత్సరాలుగా ఎన్నికల్లో ఓటు వేస్తూవచ్చి, అకస్మాత్తుగా ఓటర్ల జాబితాలో తన పేరు కనిపించకపోతే, ఆ వ్యక్తికి కారణం ఏమిటో తెలుసు కునే అవకాశం, అభ్యంతరం చెప్పే అవకాశం, తన పేరు తిరిగి చేర్చుకునే న్యాయపరమైన ప్రక్రియఅందుబాటులో ఉండాలి.ఎన్నికల సంఘం స్వయంగా వెల్లడిస్తున్న ప్రకారం, ఓటర్ల జాబితా సవరణలో చేర్పులు, తొల గింపులు, అభ్యంతరాలు, అప్పీళ్లకు విధి విధానాలు ఉన్నాయి. ఈసీఐ పోర్టల్‌లో సర్-2026 కోసం పేరు వెతకడం, నోటీసుకు పత్రాలు సమర్పించడం, అప్పీల్ చేయడం వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. అందువల్ల మా ప్రశ్నఅర్హత ఉన్న ఓటరిని సరైన నోటీసు, విచారణ, అభ్యంతరం మరియు అప్పీల్ అవకాశాలు లేకుండా తొలగించారా? తొలగించి ఉంటే..ఎవరి ఆదేశాలతో? ఏ ఆధారాల తో?ఏ అధికారిక రికార్డుతో?

**తొలగింపులో పొరపాటు జరిగితే బాధ్యత ఎవరిది?**

రాజ్యాంగం ఇచ్చిన హక్కు లను ఎవరూ తేలికగా తీసుకోలేరు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వ సూత్రాన్ని రక్షిస్తుంది.ఆర్టికల్ 19 పౌరుల ప్రజాస్వామ్య స్వేచ్ఛలకు రక్షణ కల్పిస్తుంది.ఆర్టికల్స్ 325--326 ఎన్నికల జాబితాలో వివక్ష లేకుండా, సార్వత్రిక ఓటుహక్కు వ్యవస్థకు రాజ్యాంగ పునాది కల్పిస్తాయి. సుప్రీంకోర్టు కూడా 2026 తీర్పులో ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో విలువైన రాజ్యాంగ హక్కు అని పేర్కొన్న విషయంఅందరి కి తెలుసు.కాబట్టి అర్హత ఉన్న పౌరుడి ఓటు హక్కు ఏ కారణంతోనైనా అన్యాయంగా నిరోధించబడితే, అది అత్యంత తీవ్రమైన రాజ్యాంగ ప్రశ్న

**సీఈసీ పదవికి రాజకీయ తటస్థతే ప్రాణం**

భారత ఎన్నికల సంఘం సాధారణ ప్రభుత్వ శాఖ కాదు. అది రాజ్యాంగబద్ధ మైన స్వతంత్ర సంస్థ. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల తయారీ, ఎన్నికల ప్రక్రియపై ఆర్టికల్ 324 కింద కీలక బాధ్యతలు దానికి ఉన్నాయి.

అందుకే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పదవిలో ఉన్న వ్యక్తి పట్ల ప్రజలకు నిష్పక్షపాతిత్వం, పారదర్శకత, విశ్వసనీయత కనిపించాలి. సీఈసీ పై ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చినప్పుడు, వాటిని కేవలం రాజకీయ ఆరోపణలుగా కొట్టివేయకుండా స్వతంత్రంగా, పారదర్శకంగా విచారణ జరిపి నిజానిజాలు ప్రజల ముందుంచాల్సిన అవసరం ఎంతైనాఉంది.

ఇటీవల ఇద్దరు ఎన్నికల కమిషనర్ ఓటర్ల చేర్పులు,తొలగింపులు, ఫారం-6 తదితర అంశాలపై పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఇండియన్ ఎక్స్ప్రెస్ నివేదించింది. మరోవైపు ఎన్నికల సంఘం తుది నిర్ణయాలు కమిషన్ స్థాయిలో తీసుకున్నట్లు పేర్కొంటోంది. ఈ విభేదాలపై పూర్తి వాస్తవాలు ప్రజలకు పారదర్శకంగా తెలియాల్సి న అవసరం ఉంది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, హర్యానా తదితర రాష్ట్రాలపై వచ్చిన ఆరోపణలు కూడా విచారణకు లోబడి తేలాలి. వివిధ రాష్ట్రాల్లో ఓట్ల అవకతవకలు, ఓటర్ల తొలగింపులు, ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. వాటిని వెంటనే నిజమని లేదా అబద్ధమని ప్రకటించకుండా, స్వతంత్ర న్యాయ,దర్యాప్తు సంస్థల ద్వారా డేటా, రికార్డులు, సాఫ్ట్‌వేర్ లాగ్‌లు, తొలగింపు కారణాలు, అప్పీళ్ల వివరాలను పరిశీలించాలి. ఎవరైనా తప్పు చేసి ఉంటే వారు ఎంత పెద్ద పదవిలో ఉన్నా చట్టం ముందు జవాబుదారీ కావాలి.

**సిఇసిపై చర్యలు ఎలా ఉండాలి?**

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ను సాధారణ ప్రభుత్వ ఉద్యోగిలా ప్రభుత్వం నేరుగా తొలగించలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం సిఇసిను సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానంలో, అదే స్థాయి ఆధారాలపై మాత్రమే తొలగించవచ్చు. 2023 చట్టంలోని సెక్షన్ 11 కూడా ఇదే రక్షణను కొనసాగిస్తోంది. సర్ ద్వారా జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఓటర్ల తొలగింపులపై స్వతంత్ర విచారణ జరపాలి. తొలగించబడిన ప్రతి అర్హతగల ఓటరికి పేరు పునరుద్ధరించుకునే సులభమైన, పారదర్శకమైన అవకాశం కల్పించాలి.సీసీఐ నెట్, వీఆర్వో వంటి ఎన్నికల డేటాబేస్‌లలో జరిగిన మార్పులపై స్వతంత్ర సాంకేతిక ఆడిట్ నిర్వహించాలి. ఓటర్ల తొలగింపుకు సంబంధించిన నోటీసులు, కారణాలు, అప్పీళ్లు, తుది నిర్ణయాలను పారదర్శకంగా వెల్లడించాలి. సిఇసి పై వచ్చిన ఆరోపణల్లో ప్రాథమిక ఆధారాలు కనిపిస్తే, చట్టబద్ధమైన పార్లమెంటరీ మరియు న్యాయపరమైన ప్రక్రియను ప్రారంభించాలి. ఆరోపణలు నిరాధారమని తేలితే కూడా విషయాన్ని ఆధారాలతో దేశ ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. ప్రజాస్వామ్యంలో ఓటు ఎవరి సొత్తు కాదు

ఓటు అనేది ఏ రాజకీయ పార్టీకి చెందిన ఆస్తి కాదు. ఓటు ప్రజల రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య భాగస్వామ్యం. ఒక ఓటు తొలగించబడితే ఒక పౌరుడి గొంతు బలహీనపడుతుంది. లక్షలాది అర్హులైన ఓటర్ల పేర్లు తప్పుగా తొలగించబడితే ప్రజాస్వామ్య ప్రతినిధిత్వంపైనే ప్రశ్నలు తలెత్తుతాయి. అందుకే ఎన్నికల సంఘం తనపై ఉన్న ప్రతి అనుమానాన్ని పారదర్శకంగా నివృత్తి చేయాలి. ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడటం సి ఈ సి వ్యక్తిగత గౌరవం కోసం మాత్రమే కాదు.భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం కూడా అత్యంత అవసరం.

ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

ఆరోపణలు నిజం కాకపోతే పూర్తి ఆధారాలతో ప్రజలకు నిజానిజాలు వెల్లడించాలి.

కానీ ప్రజల ఓటు హక్కుపై సందేహం మిగిలిపోయే పరిస్థితి మాత్రం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఈ విషయాన్ని అందరూ తెలుసుకోవాలి.



--

ఎస్.జైనుల్లా ఆబెద్దీన్ బాష, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

# మంత్రి పయ్యావులను కలిసిన రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్

- కార్యవర్గ ప్రతినిధులతో కలిసి మంత్రిని కలిసిన దివాకరరావు
- ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కోశాధికారిగా ఆర్.ఎన్.దివాకరరావు ఎన్నికపై మంత్రి హర్షం
- దివాకరరావుకు మంత్రి పయ్యావుల కేశవ్ శుభాకాంక్షలు



**అనంతపురం - సూర్య వాస్తవం :** రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) రాష్ట్ర కోశాధికారిగా ఆర్.ఎన్. దివాకర రావు ఎన్నికైన సందర్భంగా అనంతపురం జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను అనంతపురంలోని ఆయన నివాసంలో జిల్లా రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.ఎన్. దివాకరరావుతో పాటు కార్యవర్గ సభ్యులు జి. సోమశేఖర్, వి. పునీత్, జి. చంద్‌బాష, డి. ప్రసాద్, వీఆర్ఏ అసోసియేషన్ అధ్యక్షులు వి. ఓబులేసు, రఘువేంద్ర తదితరులు మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు.రాష్ట్ర స్థాయిలో ఏపీఆర్ఎస్ఏ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.ఎన్. దివాకరరావుకు మంత్రి పయ్యావుల కేశవ్ శుభాకాంక్షలు తెలియజేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

## గ్రామరెవెన్యూ సహాయకుల బిక్షాటన





**పామిడి- సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ముంగిట రెవిన్యూ గ్రామసహాయకులు(విఆర్ఎ) మంగళవారం వినూత్నంగా బిక్షాటన రూపంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షులు శంకర, ఉపాధ్యక్షులు తిరుపతయ్యలు మాట్లాడుతూ మాసంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారానికి నిరవధిక నిరాహారదీక్షలు చేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో వారు పేర్కొన్నారు. ప్రభుత్వం గతంలో సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. హామీ గడువు గడిచిపోయిన ప్రభుత్వం పట్టించు కోకపోవడంతో సెప్టెంబరు 16వ తేదీ బుధవారం నుంచి14 రోజులుగా నిరవధిక సమ్మెను చేపట్టామన్నారు. న్యాయపరమైన ముఖ్యమైన డిమాండ్లలో భాగంగా గ్రామరెవెన్యూ సహాయకులకు తెలంగాణలో మాదిరిగా పేస్కేల్ ఇవ్వాలని, అర్హత ఉన్న వారికి వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని, మిగిలిన వారికి వాచ్మన్, అటెండర్ గా ఇవ్వాలని, ప్రమోషన్ కోటాను 30% నుండి 70% శాతానికి పెంచాలని, నామినల్ వీఆర్ఎలుగా పనిచేస్తున్న వారికి, గ్రామ రెవెన్యూ సహాయకులుగా నియమించాలని, మరణించిన వీఆర్ఎల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, వారి డిమాండ్లు వ్యక్తపరిచారు. ఈకార్యక్రమంలో వీఆర్ఎలు శంకరయ్య తిరుపతయ్య సుంకన్న ప్రసాదు రామాంజనేయులు జయరామ్ సుంకప్ప వినోద్ అశోక్ వెంకటేష్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుపు కిక్స్‌తో గోల్డ్ మెడల్..

- రాష్ట్రస్థాయి పోటీలకు రాచేపల్లి మనోజ్



**పామిడి- సూర్య వాస్తవం:** తాడిపత్రిలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీల్లో పామిడి పట్టణానికి చెందిన రాచేపల్లి మనోజ్ సత్తా చాటాడు. శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి అయిన మనోజ్, బ్రూస్లీ తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. అండర్-14 బాలుర 21 కేజీల లోపు విభాగంలో ప్రత్యర్థులపై మెరుపు వేగంతో కిక్స్ చేస్తూ బంగారు పతకం సాధించాడు. దీంతో ఈ నెల 12 నుంచి 15 వరకు తాడిపత్రిలో జరిగే 70వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యాడు. మనోజ్ మరియు కోచ్ తలారి తులసీరామ్ ను శ్రీ చైతన్య స్కూల్ ఎం డి సంతోష్ రెడ్డి తనతో పాటు విద్యార్థులు అభినందించారు.

## నేడు రైతులు చలో ఎంపిఆర్ డ్యామ్



**గార్లదిన్నె- సూర్య వాస్తవం:** నేడు 30వ తేదీ ఉదయం 10:30 గంటలకు పార్టీలకు అతీతంగా రైతులందరూ ఎంపిఆర్ డ్యామ్ దగ్గర నిర్వహించే రైతు నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు.డ్యామ్ నుంచి తక్షణమే కాలువలకు నీటిని విడుదల చేసి, ఎండిపోతున్న పంటలను ఆదుకోవాలని ప్రభుత్వంపై నిరసన తెలుపుటకు రైతులందరూ తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్, మరియు 6 మండలాల నాయకులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొననున్నారు కావున రైతులందరూ స్వచ్ఛందంగా, పెద్ద ఎత్తున పాల్గొని నేడు బుధవారం చలో ఎంపిఆర్ డ్యామ్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు

# న్యాయ విద్యార్థులు రాజ్యాంగ విలువల పరిరక్షకులుగా ఎదగాలి

- విజయనగర లా కాలేజ్‌లో 'యువత భవితకు భరోసా' కార్యక్రమం
- న్యాయ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచన
- లా విద్యార్థులతో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖాముఖి



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు వద్ద ఉన్న విజయనగర లా కాలేజ్‌లో నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లా విద్యార్థులతో ముచ్చటించి, వారి విద్యా ప్రగతి, భవిష్యత్ లక్ష్యాలపై మాట్లాడారు.న్యాయ విద్య కేవలం ఒక వృత్తికి సంబంధించిన విద్య మాత్రమే కాదని, సమాజంలో న్యాయం, ధర్మం, రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యతను న్యాయ విద్యార్థులకు అందించే గొప్ప విద్య అని ఎంపీ పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయ కత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్య, ఆధునిక సౌకర్యాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలతో అనుసంధానం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపై విద్యార్థులు లోతైన అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీ సూచించారు. న్యాయవాదులు ప్రజలకు న్యాయం అందించడంతో పాటు రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. వివిధ కేస్ స్టడీల ద్వారా న్యాయ వ్యవస్థ ప్రాధాన్యతను మరింతగా అర్థం చేసుకోవచ్చని, చట్టాన్ని ఉల్లంఘించిన వారికి చట్ట ప్రకారం శిక్ష పడేలా చేయడంలో న్యాయవాదుల పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు. విజయనగర లా కాలేజ్ నుంచి గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు ఉండటం అభినందనీయమన్నారు. జూనియర్ న్యాయవాదులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ, విద్యార్థులను న్యాయ రంగంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కళాశాల చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ రామిరెడ్డి రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ రాఘవేంద్ర చారి, సీనియర్ అడ్వకేట్ నరసింహులు, సీనియర్ లెక్చరర్ హరి, అధ్యాపకులు, లా విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలి...

- గుజరాత్ తరహాలో అనంతపురంలో సూక్ష్మ పరిశ్రమలకు ప్రోత్సాహం
- ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- మహిళలు పారిశ్రామిక రంగంలోకి రావాలి: ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు పరిశ్రమలే కీలకం :ఎంపీ అంబికా




**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** గుజరాత్ తరహాలో ప్రతి ఇంట్లో చిన్న తరహా పరిశ్రమ ఉండాలని, ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు.అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఉన్న అలెగ్జాండర్ హోటల్‌లో నిర్వహించిన చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) వృద్ధి వర్క్‌షాప్ ఘనంగా జరిగింది. కార్యక్రమానికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్లు, సంబంధిత అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం జిల్లా అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో ఒకటని, ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలంటే పారిశ్రామిక ప్రగతి ఎంతో అవసరమన్నారు. గుజరాత్‌లో అనేక కుటుంబాలు తమకు ఉన్న వనరులతో చిన్నతరహా వ్యాపారాలు, పరిశ్రమలను నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాయని తెలిపారు. అలాంటి పారిశ్రామిక సంస్కృతి అనంతపురం జిల్లాలోనూ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంద న్నారు.గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఐటీ రంగాన్ని ప్రోత్సహించి, హైదరాబాద్‌లో హైటెక్ సిటీ వంటి అభివృద్ధికి బాటలు వేశారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అదే విధంగా ఇప్పుడు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు అనంతపురం నగరంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని, పనులు దాదాపు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ పార్కులో పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వ పరంగా అందుబాటులో ఉన్న రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పిస్తామని చెప్పారు.విద్యుత్ కనెక్షన్లు, మౌలిక వసతులు తదితర అంశాల్లో ఎంఎస్ఎంఈలతో పాటు మీడియం, లార్జ్ స్కేల్ పరిశ్రమలకు కూడా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ముఖ్యంగా మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళలు పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించు కోవాలని ఎమ్మెల్యే సూచించారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం, ప్రాధాన్యత అందిస్తామని తెలిపారు. అనంతపురం జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని యువత ఉద్యోగాలు వెతుక్కోవడంతో పాటు ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



# అప్రమత్తంగా ఉండి.. ఆకతాయిల ఆట కట్టించాలి

- మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



**తిరుపతి- సూర్య వాస్తవం:** ఒకప్పుడు ఫిజికల్ స్టాకింగ్ ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం సాంకేతికత వినియోగం పెరగడంతో సైబర్ స్టాకింగ్ ఎక్కువవుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. సోషల్ మీడియా, ఫోన్‌లు, మెసేజ్‌ల ద్వారా మహిళలను నిరంతరం సంప్రదించడం, వెంటపడటం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి వాటిపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో 'స్టాకింగ్ నివారణ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. ఒక నంబర్‌ను బ్లాక్ చేసినా మరో నంబర్ నుంచి పదేపదే కాల్స్, మెసేజ్‌లు చేయడం కూడా స్టాకింగ్‌లో భాగమేనన్నారు. అనుమతి లేకుండా గిఫ్ట్‌లు, బొకేలు పంపడం, మహిళల డీపీలు, ఫొటోలతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించడం, వ్యక్తిగత ఫొటోలు, సమాచారాన్ని దుర్వినియోగం చేసి వేధించడం వంటి చర్యల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పరిచయం పెంచుకుని నిరంతరం సంప్రదించడం, వెంటపడటం వంటి ఘటనలను తొలిదశలోనే గుర్తించాలని సూచించారు.

**వేధింపులకు గురైతే..ధైర్యంగా చెప్పండి**

మహిళల భద్రతకు చట్టాలు, పోలీసు వ్యవస్థతో పాటు మానసిక బలం కూడా అవసరమని శైలజ అన్నారు. వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు చెప్పాలని సూచించారు. 'సమాజం ఏమనుకుంటుంది.. బంధువులు ఏమంటారు' అనే ఆలోచనతో సమస్యను దాచిపెట్టకూడదన్నారు. సమస్యను ముందుగానే గుర్తించి ఫిర్యాదు చేస్తే మరింత తీవ్రం కాకుండా అడ్డుకోవచ్చని తెలిపారు.

**ప్రతి మహిళా హెల్ప్‌లైన్ నంబర్లను సేవ్ చేసి పెట్టుకోండి**

మహిళలు అత్యవసర సమయంలో 181 మహిళా హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు, 1930 సైబర్ నేరాల హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తుంచుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. జీరో ఎఫ్ఐఆర్‌పై కూడా మహిళలకు అవగాహన అవసరమన్నారు. ఫిర్యాదు సమయంలో అవసరమైతే మహిళా పోలీసు అధికారిని కోరే హక్కు ఉందని చెప్పారు.

**ఆత్మహత్య.. సమస్యకు పరిష్కారం కాదు**

ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులు, స్టాకింగ్ వంటి ఘటనలను సాధారణంగా తీసుకోరాదని శైలజ అన్నారు. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని, క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు, పోలీసులు, సహాయ వ్యవస్థల అండ తీసుకోవాలని సూచించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించి, అనుచిత ప్రవర్తన ఎదురైతే తల్లిదండ్రులకు చెప్పేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి అదనపు ఎస్పీ శ్రీలత, ఎస్ఐ జయస్వాములు, న్యాయ నిపుణురాలు డా. కె. శ్రావణి, ఎస్వీ విశ్వ విద్యాలయం సైకాలజీ విభాగం సైకాలజిస్ట్, కౌన్సిలర్ డా.ఎస్. విశ్వనాథ్‌రెడ్డి, మహిళా కమిషన్ సలహాదారు ఆర్. సూయజ్ పాల్గొన్నారు.

## వెంకటాద్రిపల్లి పాఠశాల విద్యా కమిటీలు ఏకగ్రీవం

**- చైర్మన్‌గా బోయ శ్రీకాంత్.. వైస్ చైర్మన్‌గా హెచ్.సువర్ణమ్మ**



**బెళుగుప్ప - సూర్య వాస్తవం:** మండలంలోని వెంకటాద్రిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు నూతన పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల సమన్వయంతో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా బోయ శ్రీకాంత్, వైస్ చైర్మన్‌గా హెచ్.సువర్ణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పయ్యావుల సోదరులు పయ్యావుల శ్రీనివాసులు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో, శీర్పి పంచాయతీ గ్రామ ప్రజల సమన్వయంతో ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పోలూరు సునీల్, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, తిప్పయ్య, జయరాములు, పోలూరు రమేష్, తగ్గుపర్తి రాధాకృష్ణ విరుపాపల్లి రాధాకృష్ణ క్లస్టర్ ఇన్‌చార్జ్ తమ్మినేని రాధాకృష్ణ, ఎన్.భాస్కర్, ఆర్.కిషోర్, బోయ వెంకటేష్, బోయ నాగభూషణ, పసవుల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను గ్రామస్థులు, నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ ఎన్నిక



**గార్లదిన్నె - సూర్య వాస్తవం:** సింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి, ఏడిసిసి బ్యాంక్ జిల్లాచైర్మన్ ముంటి మడుగు కేశవరెడ్డి ఆదేశాల మేరకు గార్లదిన్నె మండలంలోని కల్లూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ చైర్మన్ గా నబిరసూల్, వైస్ చైర్మన్ ముగ్గు మారెక్కలను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీసభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో తనవంతు బాధ్యతగా పని చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సోమలరాజన్న, సోమలమధు, రామంజి, రామాంజనేయాచారి, సుధాకరరెడ్డి, చింతావెంకటరాముడు, బాబయ్య, రామకృష్ణ, నాగేష్, నరసింహ, ఓబులేసు, ఉపాధ్యాయబృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.ఎన్. దివాకర్ రావుకు ఘనసత్కారం ...!

**- పూలమాలలతో ఘనంగా సన్మానించిన వైనం**

**- అభినందన కార్యక్రమంలో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు, మిత్రులు**

**- ఉద్యోగుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమన్న ఆర్.ఎన్. దివాకర్ రావు**



**అనంతపురం రెవెన్యూ - సూర్య వాస్తవం :** ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్‌గా ఆర్.ఎన్. దివాకర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి.ఏపీ జేఏసీ అమరావతి సభ్యులు, ఏపీ పోలీస్ ఆఫీసర్స్ రాష్ట్ర ఈసీ సభ్యుడు తలారి పెద్దయ్య ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ (ఆర్.కే.), మెడికల్ రెప్ జయకుమార్, వాల్మీకి జిల్లా నాయకులు వీర తదితరులు అర్ ఎన్ దివాకర్ రావు ను పూలమాలలతో సన్మానించి అభినందించారు.రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆర్.ఎన్. దివాకర్ రావు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి సంఘం తరపున కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఆర్.ఎన్. దివాకర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## బెస్త పీర్ల గుడికి రూ. 50వేలవిరాళం అందజేసిన గుత్తి పట్టణ అధ్యక్షులు ఎం.కె చౌదరి



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో నివాస ముంటున్న తెలుగుదేశం పార్టీ గుత్తి పట్టణం అధ్యక్షులు ఎం.కె చౌదరి గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం గుత్తి పామిడి మండలాల ఇన్‌చార్జ్ యువనేత గుమ్మనూరు ఈశ్వ ర్ ఆదర్శాలతో గుత్తి పట్టణం బెస్త గేరిలో ఉన్న పీర్ల గుడికి రూ.50వేల రూపాయలు విరాళం అందించారు. బెస్త గేరి ప్రజలు మాట్లాడుతూ గుత్తి పట్టణ అధ్యక్షులు ఎం.కె చౌదరి తన ఉదారతను చాటుకుంటూ రూ.50, 0 00 విరాళంగా అందజేశారు.సామాజిక సేవా కార్యక్రమాల్లోఎల్లప్పు డూ ముందుంటూ, తన వంతు సహ కారాన్ని అం దిస్తున్న ఎం.కె చౌదరికి హృదయ పూర్వక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు

# ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్... రాజీనామా చేయాలి...!

**- ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కును అడ్డుకునే ప్రయత్నం జరుగుతోంది**

**- ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి**

**- 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తమైన అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం**

**- ఎన్నికల కమిషన్‌పై దీర్ఘకాలిక పోరాటానికి ప్రతిపక్షాలు సిద్ధం**

**- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి**




**అనంతపురం - సూర్య వాస్తవం :** ఎన్నికల కమిషన్ ఓటర్ల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కును వినియోగించుకోకుండా అడ్డుకునే విధంగా వ్యవహరిస్తోందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై. విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. అనంతపురంలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు తమకు అనుకూలంగా ఉన్నవారికి ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ప్రయోజనం కలిగించేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల డేటాబేస్‌కు సంబంధించిన వ్యవహారాల్లో స్థానిక రెవెన్యూ అధికారులకు సంబంధం లేకుండా ఐటీ విభాగానికి చెందిన అధికారులు కీలకంగా వ్యవహరించడం పట్ల కూడా అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు.ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లు పలు నిర్ణయాలపై 10 నెలల వ్యవధిలో కనీసం 14 సార్లు లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన నివేదికలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయని విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ అంశంపై ఎన్నికల కమిషన్ తన వైఖరిని స్పష్టంగా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి ప్రజా ఉద్యమానికి సిద్ధమవు తున్నాయని ఆయన అన్నారు. అక్టోబర్ 2న నిరసన కార్యక్రమాలకు కొన్ని ప్రతిపక్ష వర్గాలు పిలుపునిచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారని విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రాతినిధ్యంతో కూడిన కమిటీ విధానాన్ని పునరుద్ధరించాలని జగన్‌మోహన్ రెడ్డి కోరినట్లు ఆయన పేర్కొన్నారు.ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై ప్రజల్లో మరింత ఆందోళన పెరగకముందే కేంద్ర ప్రభుత్వం స్పందించాలని విశ్వేశ్వర్ రెడ్డి కోరారు. ఎన్నికల కమిషన్‌పై దీర్ఘకాలిక పోరాటం మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని ఆయన పేర్కొంటూ, ప్రస్తుత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో వైస్సార్సీపీ నాయకులు కె వి రమణ, సి. పి వీరన్న ఇతర నాయకులు పాల్గొన్నారు.

# రెచ్చిపోతున్న చైన్ స్నాచింగ్ గ్యాంగ్...

**- నిఘా కొరవడిందా...?**

**- మహిళలను వెంబడించి మంగళసూత్రం, చైన్ అపహరణ**

**- అడ్డుకట్ట పడేనా...?**





**అనంతపురం క్రైమ్ -- సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలో చైన్ స్నాచర్లు మళ్లీ హల్‌చల్ చేశారు. సాయినగర్ ఆరో క్రాస్‌లో మంగళవారం ఉదయం ఓ మహిళ మెడలోని మంగళసూత్రం చైన్‌ను దుండగులు లాక్కెళ్లారు. ఉదయం 7.18 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు మహిళను వెంబడించి, అదును చూసి చైన్ లాక్కొని వేగంగా అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. సాయినగర్‌కు చెందిన శ్యామల జనరల్ స్టోర్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. బైక్ నడుపుతున్న వ్యక్తి హెల్మెట్ లేకుండా ఉండగా, వెనుక కూర్చున్న వ్యక్తి మాస్క్ ధరించినట్లు స్థానికులు తెలిపారు. చైన్ లాక్కున్న అనంతరం అక్బర్ హాస్పిటల్ మీదుగా మెయిన్ రోడ్డు వైపు దుండగులు వెళ్లినట్లు సమాచారం.



### సీసీ కెమెరాలే కీలక ఆధారం

ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే డయల్-100 సిబ్బంది స్పందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 2 టౌన్ సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో పోలీసులు బాధితురాలి ఇంటి వద్ద, ఘటన జరిగిన ప్రాంతంలో వివరాలు సేకరించారు. సమీపంలోని సీసీ కెమెరాలో దుండగుల కదలికలు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు.దుండగులు వెళ్లిన మార్గంలోని మరిన్ని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఫుటేజీల ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించి వారి ఆచూకీ తెలుసుకునే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

### మూడున్నర తులాల చైన్ అపహరణ

చోరీకి గురైన మంగళసూత్రం చైన్ సుమారు మూడున్నర తులాలు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. పట్టపగలే జన సంచారం ఉన్న ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసు కోవడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే తరహాలో నగరంలోని మరో రెండు ప్రాంతాల్లోనూ చైన్ స్నాచింగ్ ఘటనలు జరిగినట్లు సమాచారం. వరుస ఘటనల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సీసీ కెమెరా ఫుటేజీలు, దుండగులు ఉపయోగించిన బైక్ వివరాలు, వారు వెళ్లిన మార్గాల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

## జీడిపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదిలి... మత్స్యకారులను ఆదుకోవాలి...!

**- మత్స్యశాఖ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరించాలని అభ్యర్థన**

**- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు మత్స్యకారుల వినతి**



**అనంతపురం - సూర్య వాస్తవం :** జీడిపల్లి రిజర్వాయర్‌లో చేప పిల్లలను వదిలి, రిజర్వాయర్‌లో చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచాలని కోరుతూ మత్స్యకారులు ఆర్థిక శాఖ మంత్రి, ఉరవకొండ శాసనసభ్యులు పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు.అంకంపల్లి, జీడిపల్లి,రామసాగరం ప్రాంతాలకు చెందిన మత్స్య కారులు రిజర్వాయర్‌లో చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. చేప పిల్లలను రిజర్వాయర్‌లో వదిలితే చేపల ఉత్పత్తి పెరిగి తమకు మరింత ఉపాధి లభిస్తుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.మత్స్యకారుల సమస్యలపై మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ తీసుకుని మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడి, చేప పిల్లలను విడుదల చేసే అవకాశం కల్పించడంతో పాటు మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోతన్న, బ్రహ్మయ్య, నాగరాజు, కిష్టయ్య, శివకుమార్, వన్నూరుస్వామి, సంజీవరాయుడు, రాము, సునీల్, బాలచంద్ర, సంజీవ తదితర మత్స్యకారులు పాల్గొన్నారు.



## టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కమిటీ ఎన్నిక

**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలోని టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు మంగళవారం ప్రధానోపాధ్యాయులు రామకుమార్ ఆధ్వర్యంలో పాఠశాల కమిటీ ఎన్నికలు నిర్వహించారు.పాఠశాల విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.కమిటీ సభ్యులు, చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నికల కొరకై జరిగిన మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం జరిగింది. ఇందుకుగాను మొత్తం 15 మంది సభ్యులు ఎన్నికయ్యారు. చైర్మన్ గా ఎస్ మొహమ్మద్ ఆలీ, వైస్ చైర్మన్ గా ఎస్ ప్రభావతిని ఎన్నుకోవడం జరిగింది. కమిటీ సభ్యులుగా బి గణేష్,డి కావ్య, శాంత కుమారి, వై అంజినమ్మ, పరమేశ్వరరావు, జి శివశంకర్,ఎన్ లక్ష్మి,ఎం గౌసియా ఎస్ షాను, హస్మత్, లక్ష్మీబాయి, ఎస్ రేష్మ, ఎన్ వెంకటేశ్వరరెడ్డి ఎంపికయ్యారు. అనంతరం కమిటీ సభ్యులతో పాఠశాల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్కిటెక్చర్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన "మంత్రి సత్య కుమార్ యాదవ్"





**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్ పి ఏ)లో నిర్వహించిన ప్రత్యేక ఆర్కిటెక్చర్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...భారతీయ చారిత్రక ఆలయాల నిర్మాణ శైలి,వాస్తు వైభవాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు రూపొందించిన రాజరాణి టెంపుల్,ద్రాక్షారామం టెంపుల్,శ్రీ చాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి టెంపుల్, విఠల టెంపుల్––హంపి,లింగరాజ్ టెంపుల్, కందారియా మహాదేవ టెంపుల్, ఐరావతేశ్వర టెంపుల్,మోధేరా సన్ టెంపుల్ నమూనాలను పరిశీలించారు. విద్యార్థుల సృజనాత్మకత, పరిశోధనను అభినందిస్తూ,ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించి సన్మానించారు.భారతీయ వాస్తు,శిల్పకళా వారసత్వాన్ని అధ్యయనం చేసి,ఆధునిక ఆర్కిటెక్చర్‌లో మన సంప్రదాయ జ్ఞానాన్ని ముందుకు తీసుకెళ్లాలని విద్యార్థులను ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రోత్సహించారు.

## దొడ్లవారిమిట్టలో స్కూల్ కమిటీ ఎన్నిక

### - ఏకగ్రీవంగా అధ్యక్షురాలిగా ఎన్. నీరజ.. ఉపాధ్యక్షురాలిగా జే. వెంకటరమణమ్మ



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:**జీలపాటూరు పంచాయతీ పరిధిలోని దొడ్లవారిమిట్ట పాఠశాలలో స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో స్కూల్ కమిటీ అధ్యక్షురాలిగా ఎన్. నీరజ, ఉపాధ్యక్షురాలిగా జే. వెంకటరమణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ కందమూడి శివకుమార్ హాజరై నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలికి అభినందనలు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, పాఠశాలలోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కమిటీ కృషి చేయాలని సూచించారు.తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తే పాఠశాల మరింత అభివృద్ధి చెందుతుందని శివకుమార్ పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు తమ వంతు కృషి చేస్తామని నూతన అధ్యక్షురాలు, ఉపాధ్యక్షురాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎల్లిని పైర్లను పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి."ఎస్,ప్రసాద్ రావు"



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:**దొరవారిసత్రం మండలంలోని సింగన్నలతూరు మరియు కల్లూరు గ్రామాలకు మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి ఎస్ ప్రసాద్ రావు విచ్చేశారు. దొరవారిసత్రం మండలంలోని ఎల్ది ని పైరు చూసారు. ఎల్నినో ప్రభావం గురించి వివరించారు.ఎల్ది పైరు ఉన్న గ్రామాలకు ఎరువులు సరఫరా చేయడానికి సిద్ధం చేశాము అని తెలుపుతూ పంట వేసిన ప్రతి రైతుకు ఎరువులు సిఫారసు సు మేరకు అందిస్తామని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు.స్వంత పొలం ఉన్న ప్రతి ఒక్క రైతు ఫార్మర్ ఐడి చేసుకోవాలి అని రైతుల కోసం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన ఆపైమ్స్ 2.0యాప్ ను ప్లేస్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకుని ఉపయోగించాలి అని తెలిపారు.ఎల్నినో ప్రభావం వలన వర్షాలు పడని పరిస్థితుల్లో సరైన నీటి వసతి లేని రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా మినుము,పెసర,నువ్వులు వంటి పంటలు వేయదలచుకుంటే సబ్సిడీ లో విత్తనాలు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నుండి ఏడిఏ ధనుంజయ రెడ్డి సూళ్లూరుపేట ఏడిఏ ఇన్చార్జి కాంచన టిఏ సుధాకర్ రెడ్డి దొరవారిసత్రం,తడ మండల వ్యవసాయ అధికారులు జ్యోతిర్మయి మరియు కిరణ్ దొరవారిసత్రం మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు కల్లూరు నుండి ఇట్టగుంట రత్నయ్య ఇట్టగుంట మల్లికార్జున్ దొరవారిసత్రం మండలం ఆర్ఎస్ కే సిబ్బంది మరియు సింగనాలతూరు కల్లూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఏపీ ట్రాన్స్కో సబ్ స్టేషన్‌ను పరిశీలించిన డైరెక్టర్ (ఆపరేషన్)కె.గురవయ్య

**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:**తడ మండల పరిధిలోని మాంబట్టు గ్రామంలో కొత్తగా నిర్మించిన 132/33కే.వీ సబ్ స్టేషన్‌ను మంగళవారం ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ కే. గురవయ్య పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కొత్తగా నిర్మించిన సబ్ స్టేషన్ ను తొందరగా పూర్తి చేసి,వినియోగదారులకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట సూళ్లూరుపేట డి.ఇ.ఇ ఆర్.శేఖర్,తడ ఏ.ఈ,కే.మురళీ మరియు ఇతర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



# 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణంలో

# యువత కీలక పాత్ర పోషించాలి"మంత్రి సత్య కుమార్"

**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషించాలి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు, ఆయన మంగళవారం విజయ వాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో నిర్వహించిన ఆంధ్ర విజ్ఞాన సమ్మేళనంలో పాల్గొన్నాను. ఈ సందర్భంగా మాతృభాషలో విజ్ఞానాన్ని అందించడంతో పాటు జ్ఞాన పరంపర,తెలుగు సాహిత్యం, సుస్థిర అభివృద్ధి, అణు ఇంధనం,సంప్రదాయ వాస్తు జ్ఞానం, సుస్థిర నిర్మాణాలు,పర్యావరణ పరిరక్షణ, చారిత్రక వారసత్వం, నీటి సంరక్షణ, ఆయుర్వేదం,ఔషధ మూలికలు వంటి విభిన్న అంశాలపై చర్చలు జరిగాయి. యువ శాస్త్రవేత్తలు,పరిశోధకులు తమ ఆలోచనలు, ఆవిష్కరణలను మాతృభాషలో వ్యక్తీకరిస్తూ భారతీయ విజ్ఞాన సంపదను భావితరాలకు అందించాలి. 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి. అని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు..





# పాఠశాల కమిటీ అధ్యక్షుడిగా కె. వెంకటేష్ ఏకగ్రీవ ఎన్నిక

### - ఉపాధ్యక్షురాలిగా శ్రావణి.. పాఠశాల అభివృద్ధికి సమష్టి కృషి

**పెళ్లకూరు– సూర్య వాస్తవం :**పెళ్లకూరు పంచాయతీ పరిధిలోని స్థానిక పాఠశాలలో పాఠశాల కమిటీ ఎన్నికల కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఎస్సీ సెల్ అధ్యక్షుడు కన్నలి వాసు అధ్యక్షతన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల్లో పాఠశాల కమిటీ అధ్యక్షుడిగా కె. వెంకటేష్, ఉపాధ్యక్షురాలిగా శ్రావణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు సహకారం**

ఈ సందర్భంగా కన్నలి వాసు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా



వాతావరణం కల్పించడంతో పాటు అవసరమైన వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. విద్యార్థులు చదువులో ఎదుర్కొనే సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి సహకరిస్తామని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

**వసతులు, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

నూతన పాఠశాల కమిటీ పాఠశాలలో మౌలిక వసతులు, పరిశుభ్రత, విద్యార్థుల భద్రతతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని అధ్యక్షుడు కె. వెంకటేష్, ఉపాధ్యక్షురాలు శ్రావణి తెలిపారు.విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలకు కూడా సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.



# హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన సదస్సు

**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు దిశా విభాగం సహకారంతో మంగళవారం నవజీవన్ ఆర్గనైజేషన్–సి.సి–పి.యు–ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో"ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన సదస్సును దొరవారిసత్రం మండలం లోని నెలబల్లి గ్రామం నందు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమములో భాగముగా ప్రాజెక్ట్ మేనేజర్ అయిన కె.బాలాజి మాట్లాడుతూ, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు,హెచ్.ఐ.వి/ఎయిడ్స్ లక?షణాలు,అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్,క్షయ వ్యాధి సంబందం గూర్చి,సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి, డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి,హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017,ఎ.ఆర్.టి మందులు,ఏ.పి.శాక్స్ యాప్,టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు,ఓ.ఆర్.డబ్ల్యూలు






ఆర్.భువనేశ్వరి, కె. జయశ్రీ,ఎ.యన్.యమ్ జి.శ్రీలత, పి.ఇ పి.కవిత మరియు 50 మంది సాధారణ ప్రజలు పాల్గొనడం జరిగింది.తదుపరి ఈ ఏరియాలోనే హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం కోసం ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ ర్యాలీలో 50 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. వీరిలో 11 మంది ప్రజలుకు నవజీవన్ సంస్థ ఎ.యన్.యమ్ జి.శ్రీలత ద్వారా హెచ్.ఐ.వి పరీక్షలు చేయించి వారి స్థితిని వారికి తెలియజేయడం జరిగింది.

# నేర రహిత సమాజంపై విద్యార్థులకు

# అవగాహన కలిగించిన"ఎస్ఐ అజయ్ కుమార్"

**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:**తిరుపతి జిల్లా సూళ్ళూరుపేటలోని స్థానిక జడ్పీ హైస్కూల్ మరియు కోటపోలూరు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎన్నికల పర్యవేక్షణ సందర్భంగా విద్యార్థులకు,తల్లిదండ్రులకు సూళ్ళూరుపేట సబ్ ఇన్‌స్పెక్టర్ జి.అజయ్ కుమార్ అందించిన మార్గదర్శనం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు,నాయుడుపేట డిఎస్పీ జి.చెంచుబాబు ఆధ్వర్యంలో, సూళ్ళూరుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ నేరుగా పర్యవేక్షించగా,ఎస్సై జి.అజయ్ కుమార్ పాఠశాల కమిటీ ఎన్నికల సందర్భంగా, పాఠశాలలకు విచ్చేసిన ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్సై, అనంతరం విద్యార్థులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశము ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, విద్యార్థులు సమాజంలో



నేరాల పట్ల మరియు సామాజిక బాధ్యతల పట్ల ఎంత అప్రమత్తంగా ఉండాలో వివరిస్తూ ఆయన అత్యంత ఆకట్టుకునే రీతిలో సందేశాన్ని అందించారు. వర్తమాన సమాజంలో ఎదురవుతున్న పలు సవాళ్లపై సమగ్రమైన అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, బాలల రక్షణ కోసం అమలులో ఉన్న పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరించారు.నేటి డిజిటల్ యుగంలో తీవ్రరూపం దాల్చుతున్న సైబర్ నేరాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సులభ శైలిలో మార్గదర్శనం చేశారు.రోడ్డు భద్రత నియమాలు పాటించడం వల్ల ప్రాణాపాయం నుంచి ఎలా తప్పించుకోవచ్చో సూచించారు.యువతను నిర్వీర్యం చేస్తున్న గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను స్పష్టంగా వివరిస్తూ, వాటికి దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు.ఎస్సై అజయ్ కుమార్ విద్యార్థులతో ఎంతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ అందించిన హితబోధ,వారిలో నైతిక విలువలను మరియు చట్టంపై గౌరవాన్ని పెంచేలా ఎంతో ఆకట్టుకుంది.నేర రహిత సమాజ స్థాపనలో విద్యార్థుల పాత్ర కీలకమని ఆయన స్పష్టం చేశారు.



## ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ చూసి ఏడ్చేశా..

# ఇది పక్కా హిట్: రాజమౌళి



ప్రముఖ మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ కథానాయకుడిగా, ఎస్.ఎస్. రాజమౌళి సమర్పణలో వస్తున్న ఫాంటసీ ఎంటర్‌టైనర్ ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’. శశాంక్ ఏలేటి దర్శకత్వంలో ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్టోబర్ 2న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో, హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకకు మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరై సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, రాజమౌళి సినిమాపై వ్యక్తం చేసిన బలమైన నమ్మకం అంచనాలను పెంచింది.దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. “మూడేళ్ల క్రితం దర్శకుడు శశాంక్ వచ్చి ‘ఒక దయ్యాన్ని కిడ్నాప్ చేసిన మనిషి కథ’ అని ఒక్క లైన్‌లో చెప్పాడు. ఆ తర్వాత మూడు గంటలు కథ వినిపించాడు. వెంటనే ఓకే చేశాను. ఈ సినిమా చూసి నేను ఏడ్చాను.

అంతగా ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యాను. ఇది కచ్చితంగా చాలా పెద్ద హిట్ అవుతుంది. ఫహాద్ ఫాజిల్ నటన అద్భుతం. ఆయన తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. ఇక కార్తికేయ ఒక మంచి బిజినెస్ మ్యాన్. అతను ఉన్నత స్థాయికి వెళతాడు. అక్టోబర్ 2న ప్రేక్షకులు థియేటర్లలో ఒక గొప్ప సినిమాను ఎంజాయ్ చేస్తారు” అని ధీమా వ్యక్తం చేశారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ మాట్లాడుతూ.. తమ్ముడు కార్తికేయ నిర్మాతగా తొలి అడుగు వేయడం గర్వంగా ఉందన్నారు. “గాయం నుంచి కోలుకున్నా, ‘డ్రాగన్’ చెప్పిన సమయానికే విడుదలవుతుంది. ఇక ఈ సినిమా విషయానికొస్తే, కోవిడ్ సమయంలో ఒక అద్భుతమైన టాలెంట్ మనలోకి వచ్చింది. ఆయనే ఫహాద్ ఫాజిల్. దేశంలో నాకు అతి తక్కువ మంది నటులు ఇష్టం. అందులో మొదటి వ్యక్తి ఫహాద్. ఆయన దేశం గర్వించదగ్గ నటుడు. ఆయన తెలుగులో లీడ్ యాక్టర్‌గా చేస్తున్న తొలి సినిమా గొప్ప విజయం సాధించాలి. దర్శకుడు శశాంక్‌కు, నిర్మాతగా మారిన నా తమ్ముడు కార్తికేయకు ఈ చిత్రం మైలురాయిగా నిలవాలి. ‘బాహుబలి’, ‘ట్రిపులార్’ చిత్రాల విజయం వెనుక కార్తికేయ ఉన్నాడు” అని ప్రశంసించారు.నిర్మాత ఎస్.ఎస్. కార్తికేయ మాట్లాడుతూ.. “నిర్మాతగా ఇది నా మొదటి సినిమా. తారక్ అన్నను నోరువిప్పి అడగకుండానే, తమ్ముడి సినిమా అని ఈవెంట్‌కు వచ్చి సపోర్ట్ చేసినందుకు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను. ఫహాద్ ఫాజిల్ సినిమాలంటే నాకు పిచ్చి. ఆయనతో సినిమా చేయడం అదృష్టం.

హైదరాబాద్‌లోని 75 రియల్ లొకేషన్లలో షూటింగ్ చేశాం.

ఇది పూర్తి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్” అన్నారు. హీరో ఫహాద్ ఫాజిల్ మాట్లాడుతూ, తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న అభిమానానికి ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో పాల్గొన్న దర్శకేంద్రుడు రాఘవేంద్ర రావు మాట్లాడుతూ.. “రాజమౌళి అవసరం లేకుండా, శశాంక్‌తోనే ‘బాహుబలి’ లాంటి సినిమా తీయగలమని శోభు, ప్రసాద్, కార్తికేయ ఎంతో కసితో ఈ సినిమా తీశారు. ఇది తప్పకుండా హిట్ అవుతుంది” అని చమత్కరించారు. సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ.. “ఈ సినిమా సక్సెస్ పక్కా” అంటూ ఆశీర్వదించారు. దర్శకుడు శశాంక్, సంగీత దర్శకుడు కాలభైరవ, చిత్ర యూనిట్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## “గర్భవతా?”..

### పారిస్‌లో ఐశ్వర్యరాయ్ లుక్‌పై ట్రోలింగ్



ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పారిస్ ఫ్యాషన్ వీక్‌లో భారతీయ నటి, మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్య రాయ్ బచ్చన్ మరోసారి తనదైన ముద్ర వేశారు. అయితే, ఈ ప్రతిష్ఠాత్మక వేదికపై ఆమె నడకను ప్రశంసించే వారికంటే, ఆమె శరీరాకృతిని విమర్శించే వారే ఎక్కువగా కనిపించారు. లోరియల్ పారిస్ నిర్వహించిన షోలో పాల్గొన్న ఐశ్వర్య, ఆ తర్వాత సోషల్ మీడియాలో తీవ్రమైన బాడీ షేమింగ్‌కు గురయ్యారు.పారిస్‌లోని ప్లేస్ జోఫ్రీలో, ఈఫిల్ టవర్ నేపథ్యంగా సెప్టెంబర్ 28న లోరియల్ పారిస్ ‘వాక్ యువర్ వర్త్’ థీమ్‌తో ఓ ఫ్యాషన్ షోను నిర్వహించింది. మహిళల ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వం, వైవిధ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

ఇందులో లోరియల్‌కు దశాబ్దాలుగా ప్రచారకర్తగా ఉన్న ఐశ్వర్య రాయ్, నల్లటి వెల్వెట్ దుస్తులు, తలపై కిరీటం, రెడ్ హెయిర్, బోల్డ్ రెడ్ లిప్‌స్టిక్‌తో ర్యాంప్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమెతో పాటు కెండల్ జెన్నర్, ఇవా లాంగోరియా, కారా డెలివింగ్నే వంటి అంతర్జాతీయ తారలు కూడా ఈ షోలో పాల్గొన్నారు.అయితే, ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఆన్‌లైన్‌లో వైరల్ అయిన వెంటనే, కొందరు నెటిజన్లు ఐశ్వర్య శరీరాకృతిని లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రారంభించారు. “ఆమె గర్భవతా?”, “పొట్ట కనిపిస్తోంది” అంటూ కొందరు కామెంట్స్ చేయగా, మరికొందరు “ష్రెక్‌లోని ఫియోనాలా ఉంది” వంటి దారుణమైన పోలికలు తెచ్చారు. ఆమె బరువు, దుస్తులు, మేకప్‌పై కూడా విమర్శలు గుప్పించారు.

మహిళా సాధికారతను చాటిచెప్పే వేదికపైనే ఒక మహిళను శారీరకంగా కించపరిచేలా వ్యాఖ్యలు రావడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇటీవలే నటి కత్రినా కైఫ్ ప్రసవానంతరం తన శరీరాకృతిపై ఇలాంటి ట్రోలింగ్‌నే ఎదుర్కొన్నారు. ఆ సమయంలో సల్మాన్ ఖాన్ ‘బిగ్ బాస్’ వేదికగా, తల్లులయ్యాక మహిళలను ఎలా టార్గెట్ చేస్తారో ప్రస్తావించారు. ఇప్పుడు ఐశ్వర్య విషయంలోనూ అదే పునరావృతం కావడం సోషల్ మీడియాలోని విష సంస్కృతికి అద్దం పడుతోంది. అయితే, ఈ విమర్శలను పట్టించుకోకుండా ఎప్పటిలాగే ఐశ్వర్య తన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు.



## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం..

# రిలేలో విద్యా రామరాజ్ అద్భుత ప్రదర్శన




ఆసియా క్రీడల అథ్లెటిక్స్‌లో భారత మహిళల జట్టు స్వర్ణ పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన మహిళల 4ఇ400 మీటర్ల రిలే ఫైనల్లో భారత బృందం అద్భుతమైన ప్రదర్శనతో పసిడిని ముద్దాడింది. కిరణ్ పహల్, ఎం.ఆర్. పూవమ్మ, ప్రాచి, విద్యా రామ్‌రాజ్‌లతో కూడిన భారత జట్టు 3 నిమిషాల 29.69 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని అగ్రస్థానంలో నిలిచింది. ఈ విజయంతో గత ఆసియా క్రీడల్లో సాధించిన రజతాన్ని భారత్ స్వర్ణంగా మార్చుకుంది.రేసు ఆరంభం నుంచి భారత్ పతకం కోసం తీవ్రంగా పోటీపడింది. తొలి ల్యాప్‌లో పరుగెత్తిన కిరణ్ పహల్ మూడో స్థానంలో బ్యాటన్‌ను అందించగా, రెండో ల్యాప్‌లో అనుభవజ్ఞురాలైన పూవమ్మ వేగాన్ని పెంచి భారత్‌ను పోటీలో ముందుకు తెచ్చింది. ఇప్పటికే వ్యక్తిగత 400 మీటర్ల విభాగంలో కాంస్యం గెలుచుకున్న ప్రాచి, మూడో ల్యాప్‌లో అదే ఊపును కొనసాగించి పతకాన్ని ఖాయం చేసే స్థితిలో నిలిపింది.ఇక చివరిదైన యాంకర్ లెగ్‌లో విద్యా రామ్‌రాజ్ తన సత్తా చాటింది. బహ్రెయిన్ అథ్లెట్ సల్వా ఈద్ నాసర్ నుంచి తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, విద్యా ఏమాత్రం ఒత్తిడికి లోనుకాలేదు. చివరి 200 మీటర్లలో తనదైన శైలిలో స్ప్రింట్ చేసి, ఆధిక్యాన్ని కాపాడుకుంటూ విజయ రేఖను దాటింది. దీంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ పోరులో బహ్రెయిన్ 3:30.21 సెకన్లతో రజతం, చైనా 3:31.02 సెకన్లతో కాంస్యం గెలుచుకున్నాయి.ఈ ఆసియా క్రీడల్లో విద్యా రామ్‌రాజ్‌కు ఇది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటికే 400 మీటర్ల హర్డిల్స్‌లో రజతం, మిక్స్‌డ్ రిలేలో కాంస్యం గెలుచుకున్న ఆమె, తాజాగా రిలే జట్టుకు స్వర్ణం అందించడంలో కీలక పాత్ర పోషించి బంగారు ముగింపు పలికింది. కొన్ని దశాబ్దాల నాటి జాతీయ రికార్డును బద్దలు కొట్టిన మరుసటి రోజే ఆమె ఈ ఘనత సాధించడం గమనార్హం. 4ఇ400 మీటర్ల రిలేలో బలమైన చరిత్ర ఉన్న భారత్, ఈ విజయంతో మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.




## రెండో వన్డేలో

## సిరీస్ గెలుపే టార్గెట్..

### గువాహటిలో కోహ్లీ సెంటిమెంట్‌తో భారత్!

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను కైవసం చేసుకునేందుకు టీమిండియా సిద్ధమైంది. బుధవారం గువాహటిలోని బర్సపారా క్రికెట్ స్టేడియంలో రెండో వన్డే జరగనుంది. తొలి మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అజేయ సెంచరీతో చెలరేగగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా శతకంతో ఆకట్టుకోవడంతో భారత్ 296 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన విషయం తెలిసిందే.గువాహటి భారత్‌కు కలిసొచ్చిన మైదానం. ఇక్కడ ఆడిన రెండు వన్డేల్లోనూ టీమిండియా గెలిచింది. కోహ్లీ ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ సెంచరీలు చేయగా, రోహిత్ శర్మ కూడా ఓ సెంచరీ, ఓ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ వేదికపై జరిగిన నాలుగు వన్డే ఇన్నింగ్స్‌ల్లోనూ 300కు పైగా పరుగులు నమోదయ్యాయి. దీంతో మరోసారి బ్యాటర్లదే ఆధిపత్యంగా సాగే అవకాశం కనిపిస్తోంది.బౌలింగ్ విభాగంలో మార్పులు ఉంటాయా అన్నది ఆసక్తికరంగా మారింది. తొలి వన్డేలో మహ్మద్ సిరాజ్, ఆకిబ్ నబీ బెంచ్‌కే పరిమితమయ్యారు. ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వడంతో పాటు యశస్వి జైస్వాల్‌ను కూడా ఆడించే ఆలోచన ఉండొచ్చని తెలుస్తోంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, జియోహాట్‌స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ ఉంటుంది.
తొలి వన్డేలో కోహ్లీ 88 బంతుల్లో అజేయంగా 139 పరుగులు చేశాడు. గిల్ 108 బంతుల్లో 110 పరుగులతో మెరిశాడు. వెస్టిండీస్ తరఫున జాన్ క్యాంప్‌బెల్ 60 బంతుల్లో 62, జస్టిన్ గ్రీవ్స్ 108 బంతుల్లో 101 పరుగులు చేశారు. ఒక దశలో విండీస్ 19 ఓవర్లకు వికెట్ నష్టపోకుండా 135 పరుగులు చేసింది. ఆ తర్వాత కుల్దీప్ యాదవ్ (4/40) అద్భుత బౌలింగ్ తో కీలక వికెట్లు తీసి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు.

# దుమ్ముురేపిన అథ్లెట్లు

**నగోయా** :ఆసియా క్రీడల ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత అథ్లెట్లు దుమ్మురేపుతున్నారు. అంచనాలకు తగ్గట్టే పతకాల మోత మోగిస్తున్నారు. స్వర్ణం రాకపో యినప్పటికీ, మన అథ్లెట్లు రజతాలు కాంస్యాలతో సత్తా చాటుతున్నారు. పురుషుల జావెలిన్‌త్రోలో భారత అథ్లెట్లు యశ్వీర్ సింగ రజతం,




రోహిత్ యాదవ్ కాంస్యం సాధించారు. యశ్వీర్ సింగ్ 85.72 మీటర్ల దూరం ఈటెను విసిరి రజత పతకం కైవసం చేసుకున్నాడు. రోహిత్ యాదవ్ 84.35 మీటర్ల త్రోతో కాంస్య సాధించాడు.

**రజతంతో మెరిసిన ఇషా**

ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా గాయం కారణంగా ఈ పోటీలకు దూరమవగా, ఈ ఇద్దరు అథ్లెట్లు భారత్‌కు డబుల్ పోడియం విజయాన్ని అం దించారు. శ్రీలంక అథ్లెట్ రుమే శ్ పతిరంగ పసిడి పతకం సాధించాడు. మరోవైపు మ హిళల 400 మీటర్ల హా ర్డిల్స్‌లో భారత అథ్లెట్ విథ్యా రామ్రాజ్ దిగ్గజం పీటీ ఉష రికార్డును బ్రేక్ చేయడమే గాక కాంస్య పతకం తో మెరిసింది. 400 మీటర్ల హార్డిల్స్‌ను విథ్యా రామ్‌రాజ్ 54.75 సెకన్లలో పూర్తి చేసి మూ డో స్థానంలో నిలిచి కాం స్యం ఒడిసిపట్టింది.

# రాయచోటి మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోదాము తనిఖీ

**- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**





అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం :అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24-7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు తనిఖీల్లో భాగంగా రాయచోటి పట్టణం మార్కెట్ యార్డ్ లో ఉన్న ఈవీఎం గోదామును మంగళవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్ లో అంతర్భాగాలను రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాయచోటి తాసిల్దార్ యామిని, కలెక్టరేట్ ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మీది మంచి ప్రభుత్వమే అయితే ఓటింగ్ కు 'రెఢీ' యా

**- వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల**



**సిద్దవటం -సూర్యవాస్తవం :** కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వమే అయితే ప్రజల విశ్వాసాన్ని చూరగొని ఉంటే ఓటింగ్ కు రెఢీ యా అని వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరి రెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని భాకరాపేటలో మంగళవారం ఆమె మాట్లాడుతూ నాటి వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కులాలు మతాలు, రాజకీయాలు చూడకుండా ప్రతి గడప గడపకు వాలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించేవారన్నారు. డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళకు చేయూత ద్వారా 18,750 వేలు ఆర్థిక సహాయం, వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత కార్మికుల పింఛన్లు, బీటెక్, డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్, ఇంటర్మీడియట్ లోపు విద్యార్థులకు అమ్మఒడి, చేతి వృత్తుల వారికి ప్రతి ఏడాది 10 వేలు ఆర్థిక సహాయం, చేనేత కార్మికులు నేతన్న నేస్తం ద్వారా 24 వేలు ఆర్థిక సహాయం, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులకు రూ. 10 వేలు వడ్డీ లేని రుణం వంటి ఎన్నో సంక్షేమ పథకాలు ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు ప్రజలకు సూపర్ సిక్స్ అంటూ అబద్ధపు హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర అభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. మహిళకు ఉచిత ప్రయాణం అంటూ ఫ్రీ బస్సు పెట్టి బస్సులను కుదించి మహిళలను బస్సుల్లో సీట్లు కూడా దొరకకుండా ఇబ్బందికి గురి చేస్తుందన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం కార్యకర్తలకు దోచి పెట్టేందుకు సోషల్ మీడియాలో రీల్స్ పెడితే డబ్బులు ఇస్తామని ప్రకటించిందన్నారు. మీరు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చి ఉంటే ప్రజలు తప్పకుండా ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపిస్తారన్నారు. హామీలను నెరవేర్చలేదు కాబట్టే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేయరని గ్రహించి పోలీసుల సహాయంతో ఎలాగైన ఎన్నికల్లో గెలవాలని చూస్తుందన్నారు. నీతిగా, నిఖచ్చిగా ఎన్నికల కురుక్షేత్రంలో నిలిచి కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఏమేరకు విశ్వాసం ఉందో నిరూపించుకోవాలని ఆమె కోరారు.

## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

# స్వార్మ్ ఇంటిలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీపై అవగాహన సదస్సు





**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:**

రాయచోటి: శ్రీ సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్)లో మంగళవారం నాడు డ్రోన్ టెక్నాలజీ, స్వార్మ్ ఇంటెలిజెన్స్ అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాంకేతిక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డ్రోన్ టెక్నాలజీ వినియోగాలు, భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యుక్తి ఏఐ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సంజీవ్ పాల్గొని మాట్లాడుతూ, డ్రోన్ టెక్నాలజీ ప్రస్తుతం వ్యవసాయం, రక్షణ, విపత్తు నిర్వహణ, నిఘా, మ్యాపింగ్, సరుకు రవాణా, మౌలిక వసతుల పరిశీలన వంటి అనేక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు మెషిన్ లెర్నింగ్, కంప్యూటర్ విజన్ వంటి సాంకేతికతలతో డ్రోన్ల సామర్థ్యం మరింత పెరగనుందని తెలిపారు. స్వార్మ్ ఇంటెలిజెన్స్ గురించి వివరిస్తూ, ప్రకృతిలో తేనెటీగలు, చీమలు వంటి జీవులు సమూహంగా పనిచేసే విధానం నుంచి స్ఫూర్తి పొంది అనేక చిన్న ఏజెంట్లు కలిసి ఒక క్లిష్టమైన పనిని సమర్థవంతంగా నిర్వహించే విధానమే స్వార్మ్ ఇంటె లిజెన్స్ అని చెప్పారు. ఇదే సూత్రాన్ని డ్రోన్ల సమూహాల నిర్వహణలో ఉపయోగించడం ద్వారా ఒకేసారి అనేక డ్రోన్లు సమన్వయంతో పనిచేసే అవకాశాలు ఉన్నాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. ఈ. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, ఇంజనీరింగ్ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

డ్రోన్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ప్రాజెక్టులు, పరిశోధనలపై దృష్టి సారించాలని అన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి సదస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ మాట్లాడుతూ, డ్రోన్ టెక్నాలజీ భవిష్యత్‌లో అనేక కొత్త ఉద్యోగ, స్టార్టప్ అవకాశాలకు మార్గం చూపుతుందని అన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆచరణా త్మకంగా నేర్చుకుని, సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా హాజరైన అతిథిని కళాశాల యాజమాన్యం సన్మానించి జ్ఞాపికను బహుకరించారు .ఈ సందర్భంగా డ్రోన్ టెక్నాలజీలో స్వార్మ్ ఇంటెలిజెన్స్, సమూహ నిర్ణయాలు, ఆప్టిమైజేషన్, రియల్ వరల్డ్ అప్లికేషన్స్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో

# సత్తా చాటిన ఆవుల శిరీష కు ఘనసత్కారం



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** మంగళగిరి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 లో ప్రొద్దుటూరు ఎర్రన్న కొట్టాల కు చెందిన ఆవుల చిన్న నాగముని ఆవుల వరలక్ష్మి దంపతుల చిన్న కుమార్తె ఆవుల శిరీష రాయలసీమ జెంట్స్ స్టార్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి జట్టులో ఆల్రౌండర్ ప్రతిభ కనబరిచి అద్భుతమైన ప్రతిభ కనబరిచి అటు బ్యాటింగ్ విభాగంలోనూ ఆడిన రెండు మ్యాచుల్లో 90 స్ట్రైక్ రేట్ తో ఇటు బౌలింగ్ లోను అద్భుతమైన ప్రదర్శన కనబరిచి చివరి ఫైనల్ మ్యాచ్లో నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి మొదటి నాలుగు వికెట్లను తీసి కేవలం 19 పరుగులు మాత్రమే ఇచ్చి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును గెలుచుకోవడమే కాకుండా రాయలసీమ జెంట్స్ స్టార్ జట్టు విజయానికి కీలక పాత్రను పోషించిన శిరీష కు అభినందన వెల్లువ లభించింది టోర్నమెంట్ ముగించుకొని తిరిగి తన స్వగ్రామమైన ప్రొద్దుటూరుకు వచ్చిన ఆమెకు తమ బంధువులు సన్నిహితులు సోదరులు సాటి క్రీడాకారులు ఆమె ఇంటికి చేరుకొని ఆమెకు శాలువా గజమాలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా ఆమె సన్నిహితులు మాట్లాడుతూ శిరీష గత పది సంవత్సరాల నుండి క్రికెట్లో భూతమైన ప్రదర్శన కనబరుస్తుందని ఆమె రానున్న రోజుల్లో భారత జట్టుకు ఎంపిక కావడం మా ఆకాంక్షను వారు తెలియజేశారు అనంతరం ఆంధ్రప్రదేశ్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ విజేత ఆవుల శిరీష మాట్లాడుతూ నా పైన ఇంతటి అభిమానం చూపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని నేను విజయం సాధించడం వెనక నా జుట్టు సభ్యులు కోచ్ అలాగే ఫ్రాంచైజర్ల సహకారం నాకు లభించిందని అందుకే మా జట్టు విజయం సాధించడంలో నేను కీలకమైన వికెట్లను పడగొట్టగలిగానని రానున్న రోజుల్లో మరింత కష్టపడి భారత జట్టుకు ఎంపిక కావడమే నా లక్ష్యమని ఆమె తెలియజేసింది ఈ కార్యక్రమంలో ఆమె కుటుంబ సభ్యులు ఆవుల నాగసుధ ముండ్లపాటి భాస్కర్ ఆవుల గణేష్ సూర్యనారాయణ ముండ్లపాటి చంద్రశేఖర్ కవిత మునీశ్వర్ సుధీర్ పలువురు క్రీడాకారులు సన్నిహితులు పాల్గొన్నారు.

## మంత్రులను

# పుష్పగుచ్చంతో కలిసిన జిల్లా కలెక్టర్



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** పుష్పగుచ్చంతో మంగళవారం రాత్రి అన్నమయ్య జిల్లా రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్ కి విచ్చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని, రాష్ట్ర రవాణా, యువజన మరియు క్రీడల శాఖ మంత్రి, జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ గెస్ట్ హౌస్ లో జిల్లా కలెక్టరుతో కొద్దిసేపు సమావేశమై. అక్టోబర్ రెండున జిల్లాకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు కేంద్ర మంత్రి జిల్లా పర్యటన ఏర్పాట్లు మరియు జిల్లా అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

# రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో యూరియా ,డిఎపి ఎరువులు

**- ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా రైతులకు యూరియా,డిఎపి ఎరువుల పంపిణీ**



ముద్దనూరు సెప్టెంబర్ 29 సూర్య వాస్తవం: మండలంలోని ఆయా రైతు సేవా కేంద్రాల్లో యూరియా మరియు డిఎపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా బస్తా ధర266.50 పైసలు,డిఎపి బస్తా ధర 1348 /-లు అని తెలిపారు. రబీలో సాగు చేసే పంటలకు సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు.ఎపి ఎయిమ్స్ యాప్ ద్వారా సాగు చేసే పంటలను బట్టి సిఫారస్ చేసిన పరిమాణం మేరకు ఎరువులు యాప్ ద్వారా ఇవ్వడం జరుగుతుంది అన్నారు. బొందలకుంట, ముద్దనూరు, తిమ్మాపురం, రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంది అన్నారు. అలాగే ముద్దనూరు, శెట్టివారిపల్లె, కొలవలి, రైతు సేవా కేంద్రాల్లో డిఎపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# విద్యా కమిటీ చైర్మన్‌గా గురు ప్రసాద్ ఉప చైర్మన్‌గా బోల హిమవతి



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం :** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌గా తిప్పన గురు ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప చైర్మన్‌గా బోల శ్రీనివాసులు ధర్మపత్ని బోల హిమవతి ఎన్నికయ్యారు. విద్యాశాఖ అధికారుల సమక్షంలో స్కూల్ ఆవరణలో ఈ ఎన్నికల్లో విద్యా కమిటీ చైర్మన్, ఉప చైర్మన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్ గురు ప్రసాద్, ఉప చైర్మన్ హిమవతిని పాఠశాల సిబ్బంది, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ గురు ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థినుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పాఠశాల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# రాయచోటిలో చిక్కడ్ సాహెబ్ ఉరుసు

**--అక్టోబర్ 2వ తేదీ గంధం: 3వ తేదీ ఉరుసు**



రాయచోటి-సూర్య వాస్తవం: అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గ కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బండ్లపెంటలో వెలిసిన (హజ్రత్ సయ్యద్ మాలిక్ షా) 'చిక్కడ్ సాహెబ్' అక్టోబర్ 2వ తేదీ శుక్రవారం గంధం, 3వ తేదీ శనివారం ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ చైర్మన్ మహమ్మద్ యూసుఫ్, సెక్రెటరీ ఎస్కే మోద్దీన్, దర్గా ఇంచార్జ్ యునూస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంధం రోజు మధ్యాహ్నం గొప్ప అన్నదాన కార్యక్రమం, అనంతరం ముషాయిరా ఉంటుందని తెలిపారు. ఉరుసు రోజు రాత్రి 9 గంటలకు గొప్ప ఖవాలి పోటీ ప్రముఖ టీవీ సింగర్స్అజీమ్ నాజ, సుల్తానా నాజా ఇద్దరి కళాకారుల మధ్య గొప్ప ఖవాలి పోటీ ఉంటుందని చెప్పారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున సాహెబ్ భక్తులు పాల్గొంటారని, వచ్చిన భక్తులకు దర్గా కమిటీ వారు అన్ని వసతులు,భోజన సౌకర్యం కల్పించనున్నారు. ఈ ఉరుసు ఉత్సవాలను హిందూ ముస్లిం సోదరులందరూ కలిసి విజయవంతం చేయాలని వారు కోరారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140

## పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి



**బేతంచర్ల -సూర్య వాస్తవం :**బేతంచర్ల మండలంలోని ఎంబాయి గ్రామంలో పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి భూమిపూజ చేశారు.గ్రామంలో 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణం, నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగు పరచడంతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని తెలిపారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.గ్రామస్థులు తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపడుతున్నందుకు ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజల సమస్యలపై ఆరా.. అభివృద్ధి పనులపై భరోసా..

### - సుందర్ సింగ్ కాలనీలో కోట్ల సుజాతమ్మ పర్యటన



**డోన్ -సూర్య వాస్తవం :** డోన్ పట్టణంలోని 20వ వార్డు సుందర్ సింగ్ కాలనీ ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డ్ ప్రజలతో మమేకమై, వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.వార్డులో నూతనంగా మంజూరైన సి.సి. రోడ్ల నిర్మాణ పనులు,అమృత్ 2.0 పథకం ద్వారా తాగునీటి వసతుల మెరుగుదల, అలాగే డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పనుల గురించి స్థానిక ప్రజలకు వివరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.అనంతరం స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని సుజాతమ్మ హామీ ఇచ్చారు.ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రాంత అభివృద్ధికి అవసరమైన చర్యలపై దృష్టి సారించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## పాఠశాల యాజమాన్య కమిటీ ఏకగ్రీవం





**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ తల్లంపాడు నందు మంగళవారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించడం జరిగింది.ఈ ఎన్నికలలో పాఠశాల విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు అందరు కలిసి పాఠశాల యాజమాన్యం కమిటీ సభ్యులను మరియు చైర్మన్, వైస్ చైర్మన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. కమిటీ చైర్మన్ గా చింతపూడి వీరాస్వామి వైస్ చైర్మన్ గా సిద్ధపురెడ్డి చెంచమ్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు వి,శ్రీనివాసులు,ప్రధానోపాధ్యాయులు వి రవికుమార్,ఉపాధ్యాయులు ఎమ్.వి.శేషయ్య,ఈ రవీంద్ర కుమార్ ఎం,ఆదిలక్ష్మి మరియు విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ పాఠశాల యాజమాన్య కమిటీ ని అభినందనలు తెలియజేసారు,అనంతరం సభ్యులకు ఎన్నిక పత్రాలు అందజేశారు

## ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు..."ఎస్సై అజయ్ కుమార్"



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:**ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని సూళ్లూరుపేట ఎస్సై అజయ్ కుమార్ అన్నారు.ఆయన మంగళవారం సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో వాహనాలను తనిఖీ చేశారు..ఈ సందర్భంగా ఆయన వాహనాలు నడుపు వారికి డ్రైవర్ లైసెన్సువాహనాలకి సరైన ధ్రువపత్రాలు లేకుండా నడుపుతున్న వారికి చర్యలు తప్పవని. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకపోతే అట్టివారికి అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు,వాహనం నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్ సీట్ బెల్టు,ద్విచక్ర వాహనాన్ని నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని మరీ ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు వారికి పదివేల రూపాయలు పైన జరిమానా ఉంటుందని, వారిని కోర్టుకు హాజరు పరుస్తామని వాహనదారులకు ఆయన తెలియజేశారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అప్పుడే వారు తమ గమ్య స్థానానికి చేరుకుంటారని వారు తెలిపారు.

## బైనపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి





**బేతంచర్ల -సూర్య వాస్తవం :** బేతంచర్ల మండలంలోని బైనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన 15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.అదేవిధంగా ?1.98 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బైనపల్లి-- కొమురోలు రహదారి అభివృద్ధి పనులకు కూడా భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రెయినేజీ మరియు ఇతర సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.బైనపల్లి గ్రామ అభివృద్ధికి మరిన్ని పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## పల్లె పండుగ 3.0తో గ్రామాల అభివృద్ధికి శ్రీకారం

### - మర్లపల్లిలో రూ.6.80 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ
### - నియోజకవర్గవ్యాప్తంగా రూ.15 కోట్లతో పనులు చేపడుతున్నాం: ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ





**నాయుడుపేట- సూర్య వాస్తవం:** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా నాయుడుపేట మండలం మర్లపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పనులకు భూమిపూజ నిర్వహించారు. మర్లపల్లి గ్రామంలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, రూ.1.80 లక్షలతో పశువుల పాక నిర్మాణం చేపట్టనున్నారు. ఈ రెండు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పల్లె పండుగ 3.0 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.15 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఇప్పటికే పల్లె పండుగ 1.0, 2.0 కార్యక్రమాల ద్వారా నియోజకవర్గంలో సుమారు 33 సీసీ, బీటీ రోడ్డు పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మూడో విడతలో రహదారుల అభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన ఇతర మౌలిక వసతుల పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు.అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్య వేక్షిం చాలని ఎమ్మెల్యే సూచించారు. అధికారులు, ప్రజా ప్రతి నిధులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కురుగొండ పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ ధారా అంకయ్య, టీడీపీ నాయ కులు కట్టా వెంకట రమణారెడ్డి, కాపులూరు చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కన్నుమూసిన కల్కి భగవాన్... ముగిసిన ఆధ్యాత్మిక ప్రస్థానం

- ఏకం క్షేత్రంలో మూడు రోజుల పాటు భక్తులకు కడసారి దర్శనం
- దేశ, విదేశాల నుంచి తరలిరానున్న భక్తులు
- ఆధ్యాత్మిక సాధనకు జీవితాన్ని అంకితం చేసిన గురుదేవులు
- మానవత, ఆత్మజ్ఞానం, అంతర్గత పరివర్తనపై బోధనలు
- మహాసమాధి అనంతరం ఏకం క్షేత్రంలో అంతిమ కార్యక్రమాలు





**నాయుడుపేట-సూర్య వాస్తవం:**ఆధ్యాత్మిక గురువుగా, భక్తుల ఆరాధ్య దైవంగా కొలిచే కల్కి భగవాన్ మహాసమాధి పొందారు. ఆయన మహాసమాధితో ఆధ్యాత్మిక ప్రపంచంలో విషాదం నెలకొంది. దశాబ్దాలుగా గురుదేవుల బోధనలు, ఆధ్యాత్మిక మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తున్న భక్తులు, శిష్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.చెన్నైలో ఉన్న కల్కి భగవాన్ భౌతిక దేహాన్ని వరదయ్యపాలెం మండలం బత్తలవల్లం ప్రాంతంలోని ఏకం క్షేత్రానికి తరలించనున్నట్లు సమాచారం. రేపటి నుంచి మూడు రోజుల పాటు భక్తుల కడసారి దర్శనార్థం ఆయన భౌతిక దేహాన్ని ఏకం క్షేత్రంలో ఉంచనున్నారు. అనంతరం మహాసమాధి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. గురుదేవుల చివరి దర్శనం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

**ఆధ్యాత్మిక ప్రస్థానం**

కల్కి భగవాన్ అసలు పేరు విజయ్‌కుమార్ నాయుడు. 1949లో తమిళనాడులోని నత్తం గ్రామంలో జన్మించారు. చెన్నైలో విద్యాభ్యాసం కొనసాగించిన ఆయన డి.జి. వైష్ణవ కళాశాలలో గణితశాస్త్రంలో పట్టా పొందారు. అనంతరం జీవిత బీమా సంస్థలో ఉద్యోగం చేశారు. 1977లో పద్మావతిని వివాహం చేసుకున్నారు. భక్తులు ఆమెను 'అమ్మ'గా పిలిచేవారు. విజయ్‌కుమార్ నాయుడు ఆధ్యాత్మిక రంగంతో పాటు విద్యారంగంలోనూ తనదైన ముద్ర వేశారు. 1984లో అప్పటి చిత్తూరు జిల్లాలో జీ వాశ్రమ్ పేరుతో నివాస పాఠశాలను ప్రారంభించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇచ్చే విధంగా విద్యా కార్యక్రమాలను కొనసాగించారు. అనంతరం ఈ ప్రాంగణం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా కేంద్రంగా మారింది.1990ల నుంచి ఆయన ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తృతమయ్యాయి. ధ్యానం, ఆత్మపరిశీలన, అంతర్గత పరివర్తన, ఆధ్యాత్మిక చైతన్యం వంటి అంశాలపై సాధనా కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలను నిర్వహించారు. 2000 సంవత్సరంలో వరదయ్యపాలెం ప్రాంతంలో వన్‌నెస్ సంస్థ కార్యకలాపాలు విస్తరించడంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందింది. అనంతరం ఏకం క్షేత్రం ఆధ్యాత్మిక సాధనకు ప్రముఖ కేంద్రంగా నిలిచింది.వ్యక్తిలో అంతర్గత పరివర్తన, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ధ్యానం, సాధన, దీక్ష వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ప్రేమ, శాంతి, మానవతా విలువలు, ఆత్మజ్ఞానం వంటి అంశాలపై ఆయన చేసిన బోధనలు దేశ, విదేశాల్లోని అనేక మంది భక్తులను ప్రభావితం చేశాయి.

**ఏకం క్షేత్రం వద్ద ఏర్పాట్లు**

కల్కి భగవాన్ కడసారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఏకం క్షేత్రం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు సమాచారం. భక్తుల రాకపోకలు, దర్శన ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలపై నిర్వాహకులు దృష్టి సారిస్తున్నారు.

మూడు రోజుల పాటు భక్తులకు కడసారి దర్శనం కల్పించిన అనంతరం మహాసమాధి కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పూర్తి సమయాలు, ఇతర వివరాలను నిర్వాహకులు వెల్లడించాల్సి ఉంది. గురుదేవుల భౌతిక సన్నిధి దూరమైనా ఆయన బోధనలు, ఆధ్యాత్మిక సందేశాలు, మానవతా విలువలు భక్తుల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచిపోనున్నాయి.